

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా

జిల్లాకు వర్ష హెచ్చరిక

- నాలుగు రోజులు కురిసే అవకాశం
- వెల్లడించిన విపత్తుల నిర్వహణ సంస్థ
- తీరంలో అలజడి

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో పలుచోట్ల మంగళవారం వాతావరణం మేఘావృతమైంది. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో రానున్న 24 గంటల్లో అక్కడక్కడా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నట్టు విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు ప్రకటించారు. వాయువ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడన ప్రభావంతో తీరం వెంబడి 40-60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో కాకినాడ, ఉప్పాడ తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. అల్పపీడన ప్రభావంతో మరో మూడు రోజులపాటు వర్షం కురిసే అవకాశం ఉండడంతో కాకినాడ తీర ప్రాంతంలో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. అయితే వాతావరణశాఖ హెచ్చరికలతో ఈసారైనా కచ్చితంగా వర్షాలు కురుస్తాయా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తాయంటూ వాతావరణశాఖ, విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు చేస్తున్నా.. వాతావరణ పరిస్థితి మాత్రం వాటికి విభిన్నంగా ఉంటోంది. దీంతో రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

5న నిమజ్జనాలు

- గణపతి నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి
- జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 5న గణపతి విగ్రహాల నిమజ్జనాలు, మహ్మద్ ప్రవక్త జన్మ దినోత్సవం పురస్కరించుకుని జరిగే మిలాద్ ఉన్ నబి పండుగ ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్లో మంగళవారం రెవెన్యూ, పోలీసు, పంచాయతీ, మున్సిపల్ కార్పొరేషన్, మత్స్య, అగ్నిమాపకశాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గణపతి విగ్రహాల శోభాయాత్ర స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించాలన్నారు. గత నెల 27వ తేదీన ప్రారంభమైన చవితి ఉత్సవాలు ఈనెల 5,6 తేదీల్లో ముగుస్తాయన్నారు. కాకినాడ జిల్లాలో మొత్తంగా 25 నిమజ్జన ప్రాంతాలను గుర్తించామన్నారు. నిమజ్జనాల ప్రదేశాల్లో స్టేజ్, విద్యుత్ లైట్లు, క్రేన్లు, పీఏస్ సిస్టం, బోట్లు, గజ ఈతగాళ్ల వంటి సదుపాయాలను కల్పించాలన్నారు. గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు యాత్ర నిర్వహించే రూటు వివరాలను ముందుగా పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈనెల 5న ముస్లింలు జరుపుకునే మిలాద్ ఉన్‌నబి పండుగకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆరోజు జరిగే ముస్లింల ఊరేగింపు కార్యక్రమానికి తాగునీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో డీఆర్వో వెంకట్రావు, ఏఎస్పీ మనీష్ పాటిల్ దేవరాజ్, ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి పాల్గొన్నారు.



ఫ్యాన్ కేటాయింపు.. అక్రమాల కంపు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ ప్రభుత్వశాఖలకు ఉచితంగా కేటాయించిన భూములు చాలా వరకు పరాధీనమయ్యాయి. కేటాయించిన అవసరాలకు బదులు పలువురు నేతల కబ్జాల్లోకి వెళ్లిపోయాయి. పేరుకు బయటకు ప్రభుత్వ శాఖల అవసరాలకు ఉచితంగా కేటాయిస్తే వాటిని అనేకచోట్ల చెరబట్టి దారి మళ్లించేశారు.గత వైసీపీ సర్కారు హయాంలో అలియ నేషన్ పేరిట విలువైన ప్రభుత్వ భూములు వివిధ శాఖల అవసరాలకు ఉచితంగా కేటాయించగా,వాటిలో చాలా వరకు ఆపార్టీ నేతలే వాలిపోయి ఎంచక్కా అనుభవిస్తున్నారు. లీజులకు ఇచ్చేసి అడ్డగోలుగా జేబులు నింపేసుకుంటున్నారు. సబ్‌స్టేషన్లు, స్కూళ్లు, సచివాలయాలు, ఆర్‌బీకేలు, బల్క్‌మిల్క్ సెంటర్లకు ఇచ్చిన స్థలాల్లోను పాగా వేసేశారు. ఈ తరహా కబ్జాలపై ప్రభుత్వం తాజాగా దృష్టిసారించింది. ఇంతవరకు ఎన్ని భూములు ఇలా కేటాయించారనేదానిపై నివేదికలు రప్పిస్తోంది. గడచిన ఐదేళ్లలో 5,700 ఎకరాల వరకు కేటాయించినట్టు ప్రభుత్వానికి నివేదికలు సిద్ధం చేశారు.



విలువైన భూములు ఉచితంగానే..

రెవెన్యూశాఖ ఆధీనంలో ఉమ్మడి జిల్లాలో కోట్ల విలువైన వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. వీటిని ప్రభుత్వాలు రకరకాల అవసరాల పేరుతో వినియోగించుకుంటున్నాయి. ఇతర ప్రభుత్వ శాఖలకు కావాలంటే రెవెన్యూ శాఖ నుంచి ఉచితంగా అలియనేషన్ కింద ప్రభుత్వం కేటాయిస్తూ వస్తోంది. కొన్ని కంపెనీలకు కావాలంటే ధర నిర్ణయించి వసూలు చేసి వాటికి కేటాయిస్తున్నాయి. ఇలా అలియనేషన్ కింద వివిధ ప్రభుత్వశాఖలకు ఉచితంగా కేటాయిస్తోన్న భూములు కాలక్రమేణా కబ్జాలకు గురవుతున్నాయి. కొందరు పలుకుబడి కలిగిన నేతలైతే ప్రభుత్వ శాఖల పేరుతో భూములు ఉచితంగా కొట్టేసి ఆనక వాటిలో పాగా వేసేస్తున్నారు. వీటిని వ్యాపార అవసరాలకు కేటాయించడం, సొంత వ్యాపారాలకు గోదాములు నిర్మించడం వరకు అనేక అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రధా నంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ తరహా అక్రమాలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి. అప్పట్లో జగన్ సర్కారు కొత్తగా తెచ్చిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, బల్క్ మిల్క్ కూలింగ్, చిల్లింగ్ కేంద్రాలకు ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అలియనేషన్ విధానంలో ఉచితంగా పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూఎస్, పంచాయతీశాఖ, పశుసంవర్థకశాఖలకు కేటాయించేశారు. కాలువల వెంబడి భూములను ఎడాపెడా ఇచ్చిపారేశారు.వీటిని కేటాయించిన అవసరాలకు కాకుండా ఆ ముసుగులో కొందరు వైసీపీ నేతలు మూడు జిల్లాల్లో పలుచోట్ల వాటిలో పాగా వేసేసి సొంత అవసరాలకు వాడుకుంటు న్నారు.దీంతో ప్రస్తుత ప్రభుత్వం వీటిపై కన్నేసింది. గత ఐదేళ్లలో ఏయే శాఖలకు వీటిని ఎంతెంత విస్తీర్ణంలో కేటాయించారు? వాటిలో అసలు ఎవరుంటున్నారు? ఆయా శాఖల అవ సరాలకు నిజంగానే వీటిని వాడుతున్నారా? లేదా? అనేదానిపై పూర్తిస్థాయిలో నివేదికలు పంపాలని కోరింది. మండలాల వారీగా ప్రభుత్వ భూములు ఎన్ని ఎకరాలు ఏయేశాఖలకు కేటాయించారో లోతుగా వివరాలు పంపాలని ఆదేశించింది. జిల్లాల వారీగా రెవెన్యూశాఖ ఈ వివరాలు సేకరించి నివేదిక సిద్ధం చేసింది.

- ప్రభుత్వ భూమి.. ప్రైవేటు లొసుగు
- భూకేటాయింపుల్లో అక్రమాలెన్నో
- గత ప్రభుత్వంలో విచ్చలవిడితనం
- 5,700 ఎకరాలు పరాధీనం
- భూముల్లో వైసీపీ నేతల పాగా
- దృష్టిపెట్టిన కూటమి ప్రభుత్వం
- జిల్లాల వారీగా నివేదికలు సిద్ధం
- అనేక చోట్ల అడ్డగోలు వ్యాపారాలు
- కాకినాడ జిల్లాలో 4,601
- కోనసీమ, తూర్పున 1,100

5700 ఎకరాల మాటేమిటి..

కాకినాడ జిల్లాలో రెవెన్యూ శాఖకు చెందిన వేల కోట్ల విలువైన 4,601 ఎకరాల భూములను వివిధ శాఖల అవసరాలకు ఇప్పటి వరకు ఉచితంగా కేటాయించినట్టు నివేదికలో తేల్చారు. ఉమ్మడి జిల్లాలో ఇదే అత్యధికం. ఇందులో కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని పది మండలాల్లో 1,903 ఎకరాలు, పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో 2,697 ఎకరాలను ఉచితంగా కేటాయించారు. ఒక్క కాకినాడ రూరల్ మండలంలోనే వేల కోట్ల విలువైన 1,483 ఎకరాలు భూములను వివిధ ప్రభుత్వ శాఖల అవసరాల ముసుగులో ఉచితంగా కేటాయించేశారు. వీటిలో ఎక్కువగా గత వైసీపీ హయాంలో కేటాయించినవే ఉన్నాయి. ప్రభుత్వశాఖలకు కేటాయించిన ఈ భూములను కొందరు వైసీపీ నేతలు తమ పలుకుబడితో కబ్జా చేసేసి సొంతంగా వాడుకుంటున్నారు. కొందరైతే ఏకంగా ప్రైవేటుగా గోదాములు నిర్మించి అద్దెలకు ఇచ్చేసుకున్నారు. మరికొందరు లీజులకు ఇచ్చేశారు. కానీ భూమి పొందిన ప్రభుత్వ శాఖలు మాత్రం కిమ్మనడం లేదు. తొండంగి మండలంలో 2,405ఎకరాల్లో సగానికి పైగా కాకినాడ సెజ్‌కు కేటాయించారు. మరికొంత పోలవరం కాలువ, సబ్‌స్టేషన్లకు కేటాయించారు. వీటిలోను అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. కోనసీమ జిల్లాలో గడచిన ఐదేళ్లలో 479 ఎకరాల వరకు కేటాయించారు. ఇందులో జల వనరులు, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో, పంచాయతీశాఖలకే అధికంగా ఉన్నాయి. వీటిలోను అనేక చోట్ల ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. పలుచోట్ల చెరువులు, కోళ్లఫారాలు, షెడ్లు నిర్మించేసి వాడేసుకుంటున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, అనపర్తి నియోజకవర్గాల్లో కేటాయింపులు జరగ్గా, వీటిలోను అనేకచోట్ల ఆయా శాఖలకు కేటాయించిన భూములపై నిఘాలేక ఇతరత్రా అవసరాలకు మళ్లిపోయినట్టు గుర్తించారు. తాజాగా ఉన్నతాధికారులు ఈ మేరకు భూకేటాయింపుల వివరాలతో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నారు.

నెలంతా.. రేషన్!



- 15రోజుల కాలపరిమితి ఎత్తివేత
- 365 రోజులు రేషన్ దుకాణాలు
- 17 లక్షల కార్డుదారులు
- ఉమ్మడి జిల్లాలో అమలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారులకు శుభవార్త. ఇక నుంచి ప్రభుత్వ చౌక ధరల దుకాణాలు నెలంతా తెరిచే విధంగా పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేయనుంది. ఇప్పటికే దీనిపై ఆ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ క్లారిటీ ఇచ్చేశారు. ఇకపై నెలంతా రేషన్ ఇచ్చే విధంగా ఆదేశాలు ఇస్తున్నామని మంత్రి ప్రకటించారు. దీంతో లబ్ధిదారుల ఆనందానికి హద్దే లేకుండా పోయింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 17 లక్షల మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరందరూ ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు మాత్రమే రేషన్ డిపోల నుంచి సరుకులు తీసుకుంటున్నారు. అయితే వివిధ పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన కూలీలు, సామాన్యులు ఒక్కొక్క పర్యాయం అనుకున్న సమయానికి రేషన్ తీసుకోలేకపోతున్నారు. అలా తీసుకోని నెలలో బియ్యం, పంచదార వంటి నిత్యావసర వస్తువులు వదులుకోవాల్సి వస్తోంది. తాజాగా పౌరసరఫరాలశాఖ మంత్రి ఇచ్చిన ప్రకటన నేపథ్యంలో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు మాత్రమే రేషన్ ఇవ్వడం వల్ల కేవలం 90 శాతం కార్డుదారులకు మాత్రమే రేషన్ సరఫరా అవుతుంది. ప్రధానంగా నగరాల్లో, పట్టణాల్లో అయితే పోర్టబులిటీ విధానం వల్ల ప్రతి నెల పదో తేదీ వచ్చే సరికే పలు దుకాణాల్లో బియ్యం నిండు కుంటు న్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి పట్టణాలకు వలస వచ్చిన కార్మికుల కారణంగా ఇలాంటి పరిస్థితి నెలకొంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రధానంగా కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు తదితర పట్టణాల్లో ప్రతి నెల పదో తేదీకే 50 శాతం రేషన్ దుకాణాల్లో బియ్యం నిండుకుం టున్నాయి. దీనివల్ల బియ్యాన్ని పేదలు పొందలేక పోతున్నారు. ఇలాంటి సమస్యల నుంచి గట్టెక్కాలంటే నెలంతా రేషన్ పంపిణీ ద్వారా సాధ్యపడుతుంది. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి నెలాఖరు వరకు రేషన్ పంపిణీ చేయడం వల్ల ఏదైనా వీలున్న సమయంలో సరుకులు తెచ్చుకునే సౌలభ్యం లభిస్తోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో ఉన్న రెండువేల రేషన్ దుకాణాలు ఇక నుంచి నెలంతా ఓపెన్ చేసే ఉంటాయి. పేదలకు సరుకులు పంపిణీ చేస్తూనే ఉంటాయి.

త్వరలో మరిన్ని సరుకులు

ఇక నుంచి రెగ్యులర్‌గా ప్రతినెల కందిపప్పు, నూనె, రాగులు, గోధుమపిండి రేషన్ కార్డుదారులకు ఇస్తామని మంత్రి ప్రకటించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కందిపప్పు, పామాయిల్, గోధుమపిండి వినియోగం ఎక్కువ. దీంతో కార్డుదారులు స్వాగతిస్తున్నారు.

ఉత్తర్వులకు ఎదురుచూపులు..

దీనిపై ప్రభుత్వం నుంచి త్వరలో ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందని కాకినాడ జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి రుద్రరాజు సత్య నారాయణరాజు తెలిపారు. ఉత్తర్వులు వచ్చిన తర్వాత దానిలో పేర్కొన్న విధంగా జిల్లాలో రేషన్ దుకాణాలు తెరిచి ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఇచ్చిన ఆదేశాల మేరకు రేషన్ దుకాణాల ద్వారా సమర్థంగా, నిత్యావసరాలు సకాలంలో అందజేస్తామన్నారు.

పంటి నొప్పి అని వెళ్తే ప్రాణమే పోయింది

తీవ్ర రక్తస్రావంతో వివాహిత మృతి

12

పుల్లల కోసం వెళ్లి.. పుట్టెడు శోకం మిగిల్చి..

ఏలేరు కాలువలో ఇద్దరి మృతి

ఏలేశ్వరంలో ఘటన

7

లాఠీచార్జ్‌పై ఎస్పీకి ఫిర్యాదు

కాకినాడ క్రైం,సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ చర్యను ఖండిస్తూ బీజేపీ నేతలు సోమవారం సాయంత్రం కాకినాడ టౌన్‌హాల్ నుంచి కాంగ్రెస్ కార్యాలయం వైపు వెళ్లారు. ఈ క్రమంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా, పోలీసులు లాఠీచార్జ్ చేసిన వ్యవహారంపై మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్పీ జి బిందుమాధవ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. శాంతియుత ర్యాలీపై పోలీసులు చేసిన లాఠీచార్జి అమానుషమని, పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. పైడా బావనప్రసాద్, తుమ్మల పద్మజ, యార్లగడ్డ రామ్‌కుమార్, చొడిశెట్టి రమేష్‌బాబు, సాహితీవర్మ, తుమ్మలపల్లి నారాయణరావు పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రం ఇస్తున్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి, ఇతర సంఘాల నాయకులు

కాకినాడ జిల్లాకు ఎంఎస్ నాయకర్ పేరు పెట్టాలి

విద్యకోసం తన యావదాస్తిని దానం చేసిన గొప్పదాత : ఎమ్మెల్యే కొండబాబు

కలెక్టరేట్‌ను ముట్టడించిన మత్స్యకారులు, బీసీ నేతలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాకు మల్లాడి సత్యలింగం నాయకర్ పేరు పెట్టాలనే డిమాండ్ ఊపందుకుంది. ఈనేపథ్యంలో మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌ను పెద్దఎత్తున మత్స్యకారులు, మత్స్యకార సంఘాల నాయకులు, బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు ముట్టడించారు. ఈ సందర్భంగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ తన యావదాస్తిని విద్య కోసం దానంచేసిన మల్లాడి సత్యలింగం నాయకర్ పేరును కాకినాడ జిల్లాకు పెట్టాలన్నారు. మహనీయులు మల్లాడి సత్యలింగం నాయకర్ తాను చదువుకోకపోయినా అప్పట్లో రంగూన్ వెళ్లి వ్యాపారం చేసి తాను సంపాదించిన ఆస్తిని విద్య కోసం దానం చేశారన్నారు. కాకినాడలో 1912వ సంవత్సరంలో ఒక ట్రస్ట్‌గా ఏర్పాటుచేసి తాను సంపాదించిన 1400 ఎకరాల భూమి, నగదును పేద విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా దానం చేశారన్నారు. ఎంఎస్ఎన్ చారిటీస్ ద్వారా ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, వేదపాఠశాల, ఆంధ్రా పాలిటెక్నిక్, ఇంటర్, డిగ్రీ కళాశాలలు నడుస్తున్నాయన్నారు. అలాగే కాకినాడలో ఉన్న ఏయూ పీజీ సెంటర్‌కు కూడా ఆయనే స్థలం దానం చేశారన్నారు. అనంతరం జేసీ రాహుల్‌మీనాకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వివిధ సంఘాల నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘాల నాయకులు సూరాడ చిన్నారావు, మల్లాడి రాజు, కామది కనకాద్రి, రేవు సురేష్, టీడీపీ నాయకులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, పెదరాజు, శివ, బీసీ సంఘాల నాయకులు పంపన రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.



దొరబాబు డప్పు.. ఉదయ్ డ్యాన్సులు!

ఒక నేత డప్పులు కొడుతుంటే మరో ఇద్దరు నేతలు డ్యాన్సులు చేశారు. పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో మంగళవారం రాత్రి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు డప్పులు కొట్టగా, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబులు డ్యాన్స్ చేసి జనసైనికులు, అభిమానులను హుషారెత్తించారు. సెంటర్‌లో వీరు చేసిన తీన్‌మార్ డ్యాన్సులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆ దృశ్యమే ఇది.. - ఆంధ్రజ్యోతి/పిఠాపురం

ఎరువుల అక్రమ విక్రయాలపై ఉక్కుపాదం

- విజిలెన్స్ తనిఖీల్లో భారీగా బయటపడ్డ నిల్వలు
- 158 మెట్రిక్ టన్నులు స్వాధీనం.. మరో 24 మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు నిలుపుదల

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ఎరువుల అక్రమ విక్రయాలపై విజిలెన్స్ బృందాలు ఉక్కుపాదం మోపుతున్నాయి. ఎక్కడా అక్రమ విక్రయాలు జరగకూడదన్న ప్రభుత్వ ఆదేశాలతో బృందాలు గత ఎనిమిది రోజులుగా పెద్దఎత్తున జిల్లాలో దాడులు నిర్వహిస్తున్నాయి. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా అక్రమంగా ఎరువులు నిల్వచేసిన ఆరు ఎరువుల దుకాణాలపై 6ఏ కేసులు నమోదు చేశారు. 158 మెట్రిక్ టన్నుల యూరియా, కాంప్లెక్స్ ఎరువులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.33.9 లక్షలుగా గుర్తించారు. అలాగే జిల్లాలో నిబంధనలను అతిక్రమించిన మరో మూడు దుకాణాల్లో 24 మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలను నిలుపుదల చేశారు. దీని విలువ రూ.9.22 లక్షలుగా ఉంది. ఎరువుల అక్రమ నిల్వలపై విజిలెన్స్ దాడులు మరిన్ని రోజులు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు. ఈసందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 6వతేదీన జిల్లాకు 1800 మెట్రిక్ టన్నుల యూరియా రానుందన్నారు. దీన్ని జిల్లాలో ఉన్న అన్ని పీఏసీఎస్‌లు, ప్రైవేటు డీలర్లకు, రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేస్తామన్నారు. జిల్లాలో యూరియా కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఎవరైనా యూరియా బ్లాక్ మార్కెటింగ్ చేస్తే తక్షణమే ఫిర్యాదు చేయాలని కోరారు.

బిల్డింగ్.. బిల్డప్పే! కథనంపై కదలిక

అధికారులపై ఎమ్మెల్యే కొండబాబు సీరియస్

కాకినాడ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో రూ.5 కోట్లతో నిర్మించిన బోటు బిల్డింగ్ యార్డు ఎందుకూ కొరగాకుండా పోయిందని, ఐదేళ్లుగా ఒక్క బోటు కూడా నిర్మాణం కాలేదంటూ మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'బిల్డింగ్.. బిల్డప్పే' శీర్షికన ప్రచురితమైన కథనానికి కాకినాడ సిటీ ఎమ్మెల్యే స్పందించారు. అధికారులను ప్రశ్నించారు. బోటు బిల్డింగ్ యార్డు తాజా పరిస్థితిపై ఆరాతీశారు. రూ.7 కోట్లతో బోటు బిల్డింగ్‌యార్డును ఆధునికీకరించామని చెప్పి ఇలా నిరుపయోగంగా ఉంచడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణాలకు అవసరమైన ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించి బోటు బిల్డింగ్ యార్డును వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.

బాలల సురక్షితమైన జిల్లాగా కాకినాడ : అసిస్టెంట్ కలెక్టర్


కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): వందశాతం బాలల సురక్షిత జిల్లాగా కాకినాడ జిల్లా నిలిచిందని అసిస్టెంట్ కలెక్టర్ మనీషా పేర్కొన్నారు. కాకినాడ కలెక్టరేట్లో మంగళవారం పడాల చారిటబుల్ ట్రస్ట్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీల ఆధ్వర్యంలో బాలికల రక్షణ, హక్కుల చట్టం, లైంగిక వేధింపులు వంటి అంశాలపై సమీక్ష చేశారు. ఐఆర్‌సీఎస్ ఏపీ చైర్మన్ వైడీ రామారావు, డీఎంహెచ్‌వో నరసింహనాయక్, ట్రస్ట్ సీఈవో సూర్యప్రసాద్ పాల్గొన్నారు.

నిల్వ నీటిలో దోమల వృద్ధిని పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

దోమ జనిత వ్యాధులపై ముందస్తు చర్యలు

మలేరియా, డెంగీ నివారణే ప్రధాన లక్ష్యం : డీఎంహెచ్‌వో

జీజీహెచ్(కాకినాడ) సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) ప్రస్తుత వర్షాకాలంలో దోమలు వృద్ధి చెంది పలు ప్రాణాపాయ రోగాలు సంక్రమిస్తున్న తరుణంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు జిల్లావ్యాప్తంగా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ జె నరసింహనాయక్ ఆదేశాలతో దోమ జనిత వ్యాధుల్లో ముఖ్యమైన డెంగ్యూ, మలేరియా విష జ్వరాలు ప్రబలకుండా గ్రామ, పట్టణాలలో వైద్యాధికారులు, సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బంది చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై జిల్లా అధికారులు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా కొబ్బరి బొండాలు, టైర్లు, మొక్కల కుండీలలో నీరు నిల్వ ఉండి పారిశుధ్య లోపం వల్ల మలేరియా, డెంగ్యూ ప్రాణాంతక వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున అధికారులతో పాటు క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటిలో పనిలా భావించి పారిశుధ్యం మెరుగుపడేలా చేస్తే ఏ వ్యాధులు దరిచేరవని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. అవసరమైనచోట నీళ్లలో గంబూసియా చేపలను వదిలితే అవి దోమల లార్వాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా దోమల వృద్ధికి చెక్ పెట్టవచ్చన్నారు. ముఖ్యంగా గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఏ వ్యాధి ఉత్పన్నం కాదన్నారు. ముఖ్యంగా నీటి నిల్వలు లేకుండా దోమలార్వా పుట్టకుండా, పెరగకుండా, దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని ఆయన సూచించారు. మురుగునీటి కాలవల్లో పంచాయితీలు, మున్సిపాలిటీల సిబ్బంది ఎప్పటికప్పుడు దోమల నివారణ స్ప్రేయర్లు పిచికారి చేయాలని సూచించారు. ప్రతి శుక్రవారం జరిగే ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. డెంగ్యూ, మలేరియా ప్రబలకుండా వ్యాధి నిరోధక చర్యలపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు.



ఆకాశ.. వీధిలో

ఆకాశవీధి అదిరిపోయింది.. ఎంతలా అంటే.. వెళ్లే అవకాశం ఉంటే ఒకసారి చూసొద్దామా అనేటంత.. మీరూ చూడండి ఎంత అందంగా ఉందో కదా.. చూసిన వారంతా వహ్వా అన్నవారే.. మంగళవారం రోడ్ కం రైలు బ్రిడ్జి పైనుంచి ఆకాశం అద్భుతంగా కనిపించి ఇలా కెమెరాలో బందీ అయ్యిందీ.. - ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

ఆ ఒక్కటీ అడక్కు..నా తొలి సినిమా

నటుడు పృథ్వీరాజ్



చాగల్లు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆ ఒక్కటీ అడక్కు సినిమాతో నటుడుగా జీవితం ప్రారంభించా...థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ ఇక్కడ అనే డైలాగ్ చాల పాపులర్ అయ్యి తనకు బాబా గుర్తింపు తెచ్చి పెట్టిందని సినీ నటుడు పృథ్వీరాజ్ అన్నారు. చాగల్లులో తెలగా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 70వ గణపతి నవరాత్రి ఉత్స వాల్లో సోమవారం రాత్రి గండ్రోతు కృష్ణారావు ఆడి టోరియంలో పృథ్వీరాజ్ దంపతులను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినాయక్ దర్శకత్వంలో త్వరలో హీరో వెంకటేష్‌తో సినిమా ప్రారంభం అవుతున్నట్టు చెప్పారు.ఉత్సవాలను నిర్వహిస్తూ కళలు, కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. రాష్ట్రం బాగుపడాలనే సంకల్పం ప్రజలకు మేలు జరగాలనే లక్ష్యంతో జనసేనాని పవన్ కల్యాణ్ కూటమిలో భాగస్వాములయ్యారన్నారు. ప్రజలకు 25 కేజీల బియ్యం కాదు కావా ల్సింది.. 25 సంవత్సరాల రాష్ట్ర అభివృద్ధి కావాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిందన్నారు.

ఇంట్లో దూరిన తాచు పాము



యానాం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఒక ఇంట్లో బుష్ బుష్ అంటూ శబ్దాలు వినిపిస్తున్నాయి..ఏమిటీ వింత శబ్దాలు అనుకుంటున్నారు.. తీరా చూస్తే తాచుపాము.. అంతే ఒక్కసారిగాబెదిరిపోయారు.. పాము పాము అంటూ కేకలు వేశారు.. అది విన్న పాము ఒక్కసారిగా పడగ విప్పింది.. యానాం మినీ సివిల్ స్టేషన్ వెనుక ఉన్న రథం షంత రోడ్డులో నాగుపాము హల్‌చల్ చేసింది.. బాలికల హాస్టల్‌ను అనుకుని ఉన్న వీటీసీ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ మూతపడింది. దీంతో భవనంలోపల బయట పెద్దపెద్ద పొదలు ఏర్పడి పాములు తిరుగుతున్నాయి. మంగళవారం ఉదయం వాటిలో నుంచి నేరుగా పాము ఇంటిలోకి దూరినట్టు స్థానికులు చెబుతున్నాయి. ఉదయం కాబట్టి సరిపోయింది అదే రాత్రి సమాయంలో అయితే ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. జనావాసాలు మధ్య ఉండే భవనం శుభ్రం చేయించాలని స్థానికులు కోరారు.

ఎలుకలను.. పట్టేద్దాం!



ఎలుకల నివారణ ఇలా చేయవచ్చు

వేసవి లేదా దమ్ము సమయంలో గట్లును చెక్కి వాటి పరిణామాన్ని తగ్గించడం, కలుపు మొక్కలు తీసివేయడం, బాటలు తీయడం ద్వారా ఎలుకల ఉధృతిని కొంత మేర తగ్గించవచ్చు. ఎలుకబోనులు, బుట్టలు వినియోగించి పంట తొలిదశలోనే నియంత్రించాలి. ఎలుకలు ఉండే బొరియల్లో ఊదర యంత్రాన్ని వినియోగించి పొగ పెట్టి చంపాలి. గుడ్ల గూబలను సంరక్షించడం ద్వారా ఎలుకలను నివారించవచ్చు. ఎలుకల నిర్మూలనకు రసాయనిక పద్ధతి మంచి ఫలితాలను ఇస్తుంది. బ్రోమోడయోలిన్ మందును వరి నూకల ఎరలో 0.005 శాతం మోతాదులో కలిపి వాడాల్సి ఉంటుంది. దీనిని తిన్న ఎలుకలు 5-6 రోజుల్లో చనిపోతాయి. ఎలుకల నివారణకు వినియోగించే బ్రోమోడయోలిన్ మందును వ్యవసాయశాఖ ఉచితంగా సరఫరా చేస్తోంది. హెక్టారుకు కనిష్ఠంగా 10 గ్రాముల మందును వాడాల్సి ఉంటుంది. 100 గ్రాముల విషపు ఎర తయారీకి 2గ్రాముల బ్రోమోడయోలిన్ మందు,96 గ్రాముల నూకలు, 2గ్రాముల నూనె కలిపి సజీవ బొరియకు 10 గ్రాముల ఎరను పొట్లాలుగా పెట్టాలి.



బ్రోమోడయోలిన్ మందు కలిపే విధానంపై అవగాహన

- ఎలుకలను విస్మరిస్తే అపార నష్టం
- వరి దిగుబడులు గణనీయంగా తగ్గే ప్రమాదం
- నేటి నుంచి సామూహిక ఎలుకల నివారణ
- బ్రోమోడయోలిన్ మందు ఉచితంగా పంపిణీ
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అమలు

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

ఎలుకలే కదా అని విస్మరిస్తే అవి కలిగించే నష్టం అపారం. దిగుబడులు గణనీయంగా తగ్గి 50 శాతం వరకూ నష్టాన్ని కలుగజేస్తాయి. వీటి సామూహికంగా నిర్మూలిస్తేనే రైతులు కష్టాల నుంచి బయటపడతారు. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపడుతున్నారు. పకృతి వైపరీత్యాల కంటే ముందు రైతులకు ఎలుకల రూపంలో బెడద ఎదురవుతోంది. విత్తనం వేసిన దగ్గర నుంచి నాట్లు, పొట్ట, ఈనే, వరి కంకులు, గింజ గట్టిపడే దశల్లో, కోతలు, ఇత ర సమయాల్లో, వరి కుప్పలు పొలాల్లో ఉంచినా ఇవి నష్టాన్ని కలగజేస్తాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నష్టశాతం అధి కంగా ఉండడం రైతులను కలవరానికి గురిచేస్తోంది.

ఎలుక జీవితకాలం 18 నెలలు

ఎలుకల జీవితకాలం 12 నుంచి 18 నెలలు. తన జీవితకాలంలో ఒక ఎలుక పది కిలోల వరకూ ఆహార ధాన్యాలను తిని మరో 100 కిలో లు పాడు చేస్తోంది. ఎలుకలతో పాటు పందికొక్కులు, ఇళ్లల్లో తిరిగే ఎలుక జాతులు వరి పంటకు 10 నుంచి 50 శాతం వరకూ నష్టాన్ని కలుగజేస్తాయి. ఎలుకలు ఉలి వంటి ముందు పళ్లతో పంటకు నష్టం చేకూరుస్తాయి. ఈ పళ్లు రోజుకి 0.4 మి.మీల వంతున పెరిగి కపాలాన్ని చీల్చుకుపోయి ఎలుక మరణించే అవకాశం ఉంది. దీని నుంచి తమను తాము కాపాడుకునేందుకు ఎదురైన ప్రతి వస్తువును ఎలుకలు కొరుకుతాయి. పొలాల్లో వరి పంటను ఇదే రీతిలో కొరుకుతూ ఉంటాయి. వరి దుబ్బులను ఏటవాలుగా 45 డిగ్రీల కోణంలో నీటిమట్టం పైభాగంలో కత్తిరించి నష్టాన్ని కలగచేస్తాయి. కాండాన్ని, మొవ్వలను తింటాయి. కుదురు ఏర్పడిన నాటి నుంచి కోత సమయం వరకూ ఎలుకలు విభృంజిస్తాయి. పాలు పోసుకుంటున్న, గట్టి పడుతున్న కంకులను కొరికి వాటిని బొరియల్లో దాచుకుంటాయి. రాత్రి పూట తిరిగే ఎలుకలు పగటి పూట మా త్రం అంతగా సంచరించవు. పొలాల్లో వరి ఇతర పంటలు ఉంటే ఎలుకలు అక్కడే ఎక్కువగా సంచరిస్తాయి. పంట లేకుంటే ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతాయి.

ఎలుకల నియంత్రణపై రైతు సేవా కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమం



వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఎలుకల నియంత్రణపై బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రైతులకు ఎలుకల బొరియల గుర్తింపు, వాటి నివారణ పద్ధతులపై అవగాహన కల్పిస్తాం. రైతులు వరినూకలు,నూనె తీసుకుని రైతు సేవా కేంద్రాలకు వస్తే బ్రోమోడయోలోన్ మందు అందజేస్తాం. - **స్వాతి, వ్యవసాయ సహాయ సంచాలకురాలు, పిఠాపురం**



వాళ్లు చదువుకున్న వెలగతోడు హైస్కూల్‌లో సత్కరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కష్టపడి..టీచర్లయ్యారు!

డీఎస్సీ కొట్టిన రోడ్ రోలర్ డ్రైవర్.. తాపీమేస్త్రి



సన్యాసి రావు మణి కుమార్

మండపేట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): చదువుకున్నామన్న గర్వం వారిద్దరికీ లేదు. చదువుకుంటే ఇప్పుడు కాకపోతే ఎప్పుడైనా ఉద్యోగం వస్తుందన్న ఆశ మాత్రం ఉంది. అయినా సరే, ఖాళీగా ఉండకుండా కుటుంబ పోషణ కోసం ఒకరు రోడ్డురోలర్ డ్రైవర్ అయ్యారు. మరొకరు తాపీమేస్త్రీగా పనిచేస్తూ వచ్చారు. ఇంతలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైంది. పగలు తమ పని చేసుకుంటూ రాత్రిళ్లు డీఎస్సీకి ప్రిపేర్ అయ్యారు. చివరకు విజయం సాధించి ఉపాధ్యాయులయ్యారు.డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం వెలగతోడు గ్రామానికి చెందిన మాచర్ల మణికుమార్, ముల్లు సన్యాసిరావు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నారు. బీఈడీ కూడా పూర్తిచేశారు. తర్వాత ఉపాధి కోసం మణికుమార్ తాపీపని చేస్తుండగా, సన్యాసిరావు రోడ్డు రోలర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. డీఎస్సీ ప్రిపరేషన్ కోసం కోచింగ్‌కు వెళ్లే స్థోమత లేక వీరిద్దరూ పగలు పనులకు వెళుతూ రాత్రి సమయాల్లో ఇంటి వద్దే చదివేవారు. డీఎస్సీలో ఉత్తమ ప్రతిభ కనబరచి మణికుమార్ 99వ ర్యాంక్ సాధించగా.. సన్యాసిరావు 336వ ర్యాంక్ సాధించి ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. చదువు తరగని ఆస్తిగా భావించిన ఈ ఇద్దరు కష్టపడి చదివి కోచింగ్ లేకుండా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన నేపథ్యంలో వెలగతోడు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సొంటెటి శ్రీనివాసరావు మంగళవారం పాఠశాలలో వీరిని సత్కరించారు. తమ పాఠశాలలో చదువుకుని ఉపాధ్యాయ పోస్టులు సాధించిన వారిని సత్కరించడం తమ కెంతో గర్వంగా ఉందన్నారు. అనంతరం వీరిద్దరూ మాట్లాడుతూ టీచర్లుగా మంచి పేరు తెచ్చుకుంటామన్నారు.టీచర్లు యేసురాజు,వీరవెంకట్రావు, సాయిబాబు, వీర భద్రరావు, సహదేవుడు, వీర్రాజు, స్వామినాథ్, తారకం, కృపామణి, ఆనంద్ అభినందించారు.

తగ్గుతున్న వరద ఉధృతి

- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- కాటన్ బ్యారేజ్ నుంచి 9,47,435 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల



కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి ప్రవహిస్తున్న వరద నీరు

ధవళేశ్వరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గోదావరి ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. రెండు రోజులుగా ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహించిన నీటి మట్టం మంగళవారం మధ్యాహ్నం 3.45గంటలకు 11.70 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఆపై క్రమంగా తగ్గుతున్న నీటి మట్టం 11.50 అడుగులకు చేరుకుంది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 9,47,435 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది.ఎగువన అన్ని ప్రాంతాల్లో గోదావరి నీటి మట్టం తగ్గుముఖం పడుతోంది. తాలిపేరు ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన నీటి ప్రభావంతో భద్రాచలం వద్ద మంగళవారం మధ్యాహ్నం 12గంటల వరకు తగ్గిన నీటి మట్టం 41.30 అడుగులకు చేరుకుని సాయంత్రం 6గంటల వరకు అదే రీడింగ్ వద్ద కొనసాగింది.

ఎగువ నీటి మట్టాలు ఇవే

ఎగువ ప్రాంతాల్లో గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. మంగళవారం సాయంత్రానికి కాళేశ్వరం వద్ద నీటి మట్టం 9.960 మీటర్లకు చేరుకోగా పేరూరు వద్ద 14.930 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 11.160 మీటర్లు, భద్రాచలం వద్ద 41.30 అడుగులు, కూనవరం వద్ద 18.080 మీటర్లు, కుంట వద్ద 10.220 మీటర్లు, పోలవరం వద్ద 11.950 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.100 మీటర్లుగా నీటి మట్టం నమోదయింది.

2068 టీఎంసీలు కడలి పాలు

కాటన్ బ్యారేజ్ నుంచి నేటి వరకు 2068.921 టీఎంసీల నీరు కడలిలో కలిసిపోయింది. గోదావరికి వరదల సీజన్ ప్రారంభమైన తరువాత ఆగస్టులో రెండు సార్లు ప్రమాద హెచ్చరికలు జారీ అయ్యాయి. వరదలు లేని జూన్‌లో 24.914 టీఎంసీల నీరు కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి ప్రవహించగా జూలైలో 677.682 టీఎంసీలు, ఆగస్టులో 1219.405 టీఎంసీల నీరు సముద్రంలోకి కలిసింది.సెప్టెంబరులో రెండు రోజులకే 146.920 టీఎంసీలు సముద్రంలోకి ప్రవహించింది

తగ్గుతూ.. పెరుగుతూ..

చింతూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వరద భయం లోతట్టు వాసుల్ని వదలడం లేదు. పదిహేను రోజులుగా తగ్గుతూ పెరుగుతూ కంటి మీదకునుకు లేకుండా చేస్తోంది.ఉదయం పూట తగ్గింది కదా అని కాసింత ఊపిరి పీల్చుకుంటే సాయంత్రం మళ్లీ పెరుగుతోంది. మంగళవారం ఉదయం భద్రాచలం వద్ద నీటి మట్టం 40.90 అడుగులుగా ఉండగా, రాత్రి 8గంటలకు స్వల్పంగా పెరిగి 41.90 అడుగులకు పెరిగింది. ఇక చింతూరు వద్ద శబరి నది ఉదయం 31 అడుగులుగా ఉండగా సాయంత్రం 8గంటలకు 32 అడుగులకు పెరిగింది. ఈ క్రమంలో మన రాష్ట్రం మీదుగా ఒడిస్సాకు వెళ్లే జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం వరకు సాగగా.. సాయంత్రం నిమ్మలగూడెం-కుయుగూరు వాగుపై ఉన్న వంతెన నీట మునగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సోకిలేరు, చీకటివాగుల ఉధృతి పదిహేను రోజులుగా కొనసాగుతోంది. దీంతో రామన్నపాలెం, పెద్దసీతనపల్లి, ముకునూరు, ఏజీ కొడేరు పంచాయతీల పరిధిలోని గ్రామాలన్నీ దిగ్బంధంలోనే ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నాటు పడవలను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల చికిత్స కోసమని ఆసుపత్రులకు తరలించిన ముగ్గురు మహిళలు మృతి చెందడంతో వారి మృతదేహాలను సైతం పడవలపైనే తరలించారు. ఎగువ రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిస్సాలలో వర్షాలు కొనసాగుతున్నాయి.



మంగళవారం ఉదయం ఒడిస్సా హైవేపై వాహన రాకపోకలు



మంగళవారం సాయంత్రానికి ఒడిస్సా హైవేపై పెరిగిన వరద

కాకినాడలో 190 వాహనం

జీజీహెచ్(కాకినాడ) సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 108 వాహనాలు కాలం చెల్లి మరమ్మతులకు గురవుతున్న నేపథ్యంలో వాటి స్థానంలో నూతనంగా 190 వాహనాలను అత్యాధునిక సాంకేతికతతో ప్రభుత్వం దశల వారీగా ప్రారంభించదలచింది. అందులో భాగంగా నూతన 190 వాహనాన్ని కాకినాడ డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ మంగళవారం ప్రారంభించారు. ఈ నూతన అంబులెన్స్‌లో అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్, ప్రాణాపాయంలో ఉన్న క్షతగాత్రులకు వెంటిలేటర్ సౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ కేర్ ట్రస్ట్ జిల్లా అధికారి రాధా కృష్ణ, 108 డీఎం అభినాష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పనపల్లిలో ఫ్లెక్సీ వివాదం

దళిత సంఘాల ఆందోళన..తొలగింపు

మామిడికుదురు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి మార్కెట్‌లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ వల్ల వివాదం తలెత్తింది. గ్రామ దళిత సంఘాలు ఫ్లెక్సీలో పేర్కొన్న వ్యాఖ్యలను ఖండిస్తూ ఆందోళన నిర్వహించారు. 'మీరెంత? మీ స్థాయి ఎంత ? రోడ్డు పడేస్తాం కొడకల్లారా! ఇది పవన్‌కల్యాణ్ సీమ, ఎప్పటికీ మాదే! అన్న వ్యాఖ్యలతో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని దళిత సంఘాలు తీవ్రంగా విమర్శించారు. దళితుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఫ్లెక్సీలో ఈ వ్యాఖ్యలు చేశారని అంబేడ్కర్ కోనసీమ జిల్లా పేరును వక్రీకరించే విధంగా ఈ వ్యాఖ్యలు ఉన్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్లెక్సీని ఏర్పాటుచేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నగరం ఎస్‌ఐ ఎ.చైతన్యకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని అక్కడి పరిస్థితిని సమీక్షించి ఆందోళనకారులతో చర్చించారు. జనసేన నాయకులు ఆ ఫ్లెక్సీని తొలగించారు. కార్యక్రమంలో దళిత నాయకులు పలువురు పాల్గొన్నారు.

సమృద్ధిగా యూరియా నిల్వలు

వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు పేర్కొన్నారు. అమరావతి నుంచి ఆయన మంగళవారం వివిధ జిల్లాల వ్యవసాయశాఖ జేడీలు, ఏడీఏలు, ఏవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ సీపోర్టుకు ఇండోనేషియా నుంచి వచ్చిన 40వేల మెట్రిక్ టన్నుల యూరియాలో ఏపీకి 17వేల మెట్రిక్ టన్నులను కేంద్రం కేటాయించిందన్నారు. అలాగే ఇతర పోర్టులకు వచ్చే యూరియా నుంచి కూడా పెద్దఎత్తున ఏపీకి కేటాయిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించారు. కాకినాడ జిల్లాలో కావాల్సిన మేరకు యూరియా సరఫరా చేస్తామన్నారు. వ్యవసాయశాఖ అధికారులు, విజిలెన్స్ బృందాలు ఎరువుల అక్రమ నిల్వలపై దాడులు చేయాలన్నారు. ఈనెల 30వ తేదీలోపు ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలన్నారు. నానో యూరియా, నానో డీఏపీపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో నాకో బృందం పర్యటన



వివరాలు అడిగి తెలుసుకుంటున్న నాకో బృందం

పెద్దాపురం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) లో ఉన్న ఐసీటీసీ, సంపూర్ణ సురక్ష, లింక్ ఏఆర్టీ కేంద్రాలను నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (నాకో, న్యూఢిల్లీ) బృందం మంగళవారం సందర్శించింది.నాకో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎంటీ దాస్, కన్సల్టెంట్ రాహుల్ అహూజాతో కూడిన బృందం ఇక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. దీనిలో భాగంగా హెచ్ఐవీ బాధితులకు అందుతున్న సదుపాయాలు, పనితీరు, భాగస్వామ్య పరీక్షలపై ఆరాతీశారు. రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఐసీటీసీ, సంపూర్ణ సురక్ష కేంద్రం, లింక్ ఏఆర్టీ కేంద్రాలకు వచ్చే వారి వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ జస్వీందర్ సింగ్, డాక్టర్ వై.కామేశ్వరప్రసాద్, అదనపు డైరెక్టర్ డాక్టర్ చక్రవర్తి, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ప్రభాకర్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమామహేశ్వరి, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రతినిధి సుకుమార్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ బుజ్జిబాబు, నాజియా హుస్సేన్, శశి, చంద్రమౌళి, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకే వర్గీకరణ

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్



సమావేశంలో మాట్లాడుతున్న రత్నాకర్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): దేశంలో దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు జరిగిన అతిపెద్ద రాజకీయ కుట్రలో భాగమే ఎస్సీ వర్గీకరణ అని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ విమర్శించారు. ప్రధాని మోదీ దేశ వ్యాప్తంగా దళితుల ఐక్యతను దెబ్బతీస్తూ లబ్ధి పొందాలనే లక్ష్యంతో ఎస్సీ వర్గీకరణ చేపట్టారని ఆరోపించారు. కోనసీమ జిల్లా అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం రత్నాకర్ మాట్లాడుతూ వర్గీకరణతో వందలో నలుగురికి మాత్రమే లబ్ధి చేకూరుతుందన్నారు.ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 59 ఎస్సీ కులాలుంటే ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణపై ఇప్పటికే చట్టాలు చేశారన్నారు. వర్గీకరణను వెనక్కు తీసుకోకపోతే దేశ వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రత్నాకర్ హెచ్చరించారు. సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షుడు కొంకి వెంకట్రావు, నెల్లి సూరిబాబు, గుఱ్ఱాల రాంబాబు, యెనుముల సత్తిబాబు, జీకురుమెల్లి కిరణ్ కుమార్, కేవీవీ సత్యనారాయణ, గుఱ్ఱాల చిట్టిబాబు, నల్లా ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

సరస్వతిదేవికి అభిషేకం

పిఠాపురానికి భారీగా తరలిన భక్తులు



సరస్వతిదేవికి అభిషేకం చేస్తున్న స్వామిజీ

పిఠాపురం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ అనఘా దత్త క్షేత్రంలో సరస్వతిదేవికి మూలానక్షత్రం సందర్భంగా తేనె, పాలుతో అభిషేకం నిర్వహించారు. క్షేత్రంలో చాతుర్మాస్య దీక్షలో ఉన్న మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామిజీ ఈ పూజాధికాలు నిర్వహించారు, నవరాత్రుల సమయంలో సరస్వతి దేవికి విశిష్టస్థానం ఉందని స్వామిజీ తెలిపారు. అమ్మవారిని జ్ఞానస్వరూపిగా అందరు కొలుస్తారని చెప్పారు. హంస వాహనంపై అమ్మవారు ఉంటారని, హంసకు పాలు, నీరుని వేరు చేయగల శక్తి ఉందని తెలిపారు. కార్యక్రమాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా వచ్చారు.



అభిషేకాన్ని తిలకిస్తున్న భక్తులు

అంతర్వేదిలో వైభవంగా పవిత్రోత్సవాలు



స్వామి,అమ్మవార్లకు అభిషేకం చేస్తున్న అర్చకులు

అంతర్వేది, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది పుణ్యక్షేత్రంలో సోమవారం రాత్రి ప్రారంభమైన స్వామివారి పవిత్రోత్సవాల్లో రెండో రోజు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనంతో ప్రారంభమయ్యాయి. స్వామివారి పురాతన కల్యాణ మండపం వద్ద ఉత్సవ మూర్తులను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులు చేసి పంచామృతాలతో, పంచ సూక్తాలు, వేద మంత్రోచ్చారణల నడుమ అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు జరిపారు. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. బుధ, గురువారాల్లో పవిత్రోత్సవాలు మరింత వైభవంగా జరుగుతాయని ఏసీ వరప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామ గోపాల రాజాబహుదూర్, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవ నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



అన్నవరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యన్నదాన పథకానికి మంగళవారం ఒక దాత రూ.లక్ష విరాళంగా సమర్పించారు. తొండంగి మండలం బెండపూడికి చెందిన మద్దుకూరి అన్నపూర్ణ లక్ష రూపాయలను దేవస్థానం చైర్మన్ రోహిత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం అందించారు.

ఉప్పాడలో ఎగసిపడుతున్న కెరటాలు



కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో ఉధృతంగా ఉన్న సముద్రం

వాతావరణంలో మార్పులు

ఆందోళనలో మత్స్యకారులు

ఏడాది వేట నిషేధం అనంతరం సముద్రంలో సరైన పాటులేకపోవడంతో తీరప్రాంత గ్రామాల మత్స్యకారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచు అల్పపీడనాలు, తుఫాన్‌లతో వేటకు వెళ్లకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్తపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరిత ఆవర్తనం ప్రభావంతో కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరప్రాంతం మంగళవారం సాయంత్రం నుంచి ఉధృతంగా మారింది. ఉదయం నుంచీ మధ్యాహ్నం వరకు సముద్రం చాపలా దర్శనమిచ్చింది. సాయంత్రం 5 గంటలు దాటాక సముద్రంలో అలలు క్రమేపీ ఉధృతవుతూ ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. ఉన్నట్టుండి వాతా వరణం అకస్మాత్తుగా మారడంతో తెల్లారేసరికి వాతావరణం ఎలా ఉంటుందోనని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా



మాయాపట్నంలో మత్స్యకారుల ఇళ్లను తాకుతున్న కెరటాలు

నర్సింగ్ పరీక్షల మాస్ కాపీయింగ్‌పై...

సూపరింటెండెంట్‌కు షోకాజ్ నోటీసులు

వారం రోజుల్లో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశం

జీజీహెచ్(కాకినాడ) సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్‌ఎం) సప్లిమెంటరీ పరీక్షలు కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఆర్‌ఎంసీలో జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే అక్కడ మాస్ కాపీయింగ్ జరుగుతుందని వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టిన ప్రత్యేక వైద్యాధికారుల కమిటీ సీసీ పుటేజ్‌ల ఆధారంగా మాస్ కాపీయింగ్ జరిగిందని నివేదికను డీఎంఈకి సమర్పించింది. ఈ నేపథ్యంలో వారం రోజుల్లో పు మాస్ కాపీయింగ్‌కు గల కారణాలను రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని డీఎంఈ షోకాజ్ నోటీసులు అందించారు. ఇదిలా ఉంటే ఆర్‌ఎంసీ అధికారులు డీఎంఈకి ఇచ్చిన నివేదిక లో సీసీ పుటేజ్‌ల ఆధారంగా మాస్ కాపీయింగ్ జరిగిందని, అలాగే పరీక్షలు రాసే నర్సింగ్ అభ్య ర్థులు కూర్చునే బెంచీలు కాపీయింగ్‌కు పాల్పడడానికి వీలుగా ఉన్నాయని, పరీక్ష హాల్లోకి వెళ్లేముందు తనిఖీలు చేసే పర్యవేక్షణ కొరవడిందని పేర్కొన్నారు. ఈ నోటీసులు సూపరింటెండెంట్‌తో పాటు డీసీఎస్ ఆర్‌ఎంవో, ఇన్విజిలేటింగ్ సిబ్బంది అందరికి అందజేశారు. అయితే గతంలో మినిస్టీరియల్ సిబ్బందిని ఇన్విజిలేటర్లుగా వేసేవారు. కారణం వారికి నర్సింగ్ సబ్జెక్ట్‌తో సంబంధం ఉండదు. కానీ ప్రస్తుతం ఇన్విజిలేటర్లుగా సుమారు 30 మంది రెగ్యులర్, కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను వేయడంతో వారికి నర్సింగ్ సబ్జెక్ట్‌పై అవగాహనా విద్యార్థులకు పరీక్షల్లో సహకరించేందుకు అనువుగా ఉంటుంది. అందువల్ల నర్సులను ఇన్విజిలేటర్లుగా ఎందుకు వేయాల్సి వచ్చిందనే దానిపై కూడా కమిటీ నివేదిక ఇచ్చింది. నర్సులను పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా వేయడం వల్ల జీజీహెచ్‌లో రోగుల సేవలకు అంతరాయం ఏర్పడిందని, ఇప్పటికే నర్సుల సంఖ్య తక్కువ కావడంతో వైద్య సేవలు అంతంతమాత్రంగా ఉన్నాయని ప్రజా సంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి.

కాకినాడలో రెండు రాజకీయ పార్టీలకు ప్రధాన ఎన్నికల అధికారి షోకాజ్ నోటీసులు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన రెండు రాజకీయ పార్టీలకు ఏపీ ప్రధాన ఎన్నికల అధికారి షోకాజ్ నోటీసులు జారీ చేశారని కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన వెలువరించారు. వీటిలో కాకినాడ ట్రెజరీ కాలనీలో ఉన్న ప్రజాపాలన పార్టీ, కాకినాడ ఎస్.అచ్చుతాపురంలో ఉన్న పేదరిక నిర్మూలన పార్టీలు ఉన్నాయన్నారు. 2019 నుంచి ఆరేళ్లపాటు ఒక్క ఎన్నికల్లో కూడా పోటీ చేయని, గుర్తింపు పొందని ఈ రాజకీయ పార్టీలకు నోటీసులు ఇచ్చామన్నారు.

మహిళపై హత్యాయత్నం

నిందితుడి అరెస్ట్

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సహజీవనం చేస్తూ మనస్పర్థల నేపథ్యంలో మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడ్ని తిమ్మాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సూర్యారావుపేటకు చెందిన వివాహితతో పరకాలువకు చెందిన మేడిశెట్టి రామకృష్ణ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. వారిద్దరి మధ్య ఏర్పడిన మనస్పర్థలతో ఆమె నెల రోజులుగా రామకృష్ణతో మాట్లాడటం లేదు, ఇంటికి రానివ్వడం లేదు. దాంతో ఆమెపై కక్ష పెంచుకున్న నిందితుడు ఆగస్టు 30వ తేదీ రాత్రి 10.30 గంటల సమయంలో కత్తితో వివాహితపై హత్యాయత్నానికి పాల్పడి తీవ్రంగా గాయపరిచాడు. బాధితురాలి అరుపులకు చుట్టుపక్కలవాళ్లు రావడంతో నిందితుడు పరారయ్యాడు. తీవ్ర గాయాలతో పడి ఉన్న ఆమెను మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన తిమ్మాపురం ఎస్‌ఐ వై.గణేష్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం సూర్యా రావుపేట నేవల్ హెలిపాడ్ సమీపంలో బీచ్‌లో నిందితుడు ఉన్నారన్న సమాచారంతో ఎస్‌ఐ సిబ్బందితో వెళ్లి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

పుల్లల కోసం వెళ్లి.. పుట్టెడు శోకం మిగిల్చి..



రోదిస్తున్న పెండ్ర లక్ష్మి కుటుంబసభ్యులు

ఏలేరు కాలువలో ఇద్దరి మృతి

కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో ఘటన

ఏలేశ్వరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు కాలువలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. చనిపోయినవారు వరుసకు వదిన, ఆడపడుచు అవుతారు. స్థానికులు, పోలీసులు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మందుల కాలనీకి చెందిన పెండ్ర లక్ష్మి (38), పొరుగున ఉన్న పెండ్ర కుమారి (13)తో మంగళవారం పుల్లల కోసం ఏలేరు కాలువ గట్టుకు వెళ్లారు. మంచినీళ్లు తాగేందుకు వెళ్లిన కుమారి కాలువలో మునిగిపోతున్న విషయాన్ని లక్ష్మి గమనించి కాపాడేందుకు వెళ్లింది. ఈక్రమంలో ఇద్దరు కాలువలో గల్లంతయ్యారు. కాలువ వద్దనే దుస్తులు ఉతుకుతున్న కొందరు సమాచారాన్ని కాలనీవాసులు, పోలీసులకు తెలిపారు. వారు సంఘటనా స్థలానికి వచ్చి గత ఈతగాళ్లతో గాలించగా రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆ ఇద్దరు చనిపోయినట్టు వైద్యులు వెల్లడించారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ రామలింగేశ్వరావు పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.



మరణించిన లక్ష్మి, కుమారి (ఫైల్)



రెండూ పేద కుటుంబాలే..

పెండ్ర లక్ష్మి, అప్పన్న పేద కుటుంబానికి చెందిన వారే. అప్పన్న తలవెంట్రుకలకు సామాన్లు ఇచ్చే వ్యాపారం చేస్తూ భార్య, నలుగురు పిల్లలను పోషిస్తున్నాడు. భార్య గృహిణిగా ఉంటూ కట్టెల కోసం వెళ్లి మృత్యువాత పడింది. భార్య మృతితో పిల్లలకు ఆసరా లేకుండా పోయిందని అప్పన్న విలపిస్తున్నాడు. ఇదే కాలనీకి చెందిన పెండ్ర సత్తిబాబు, అంకమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వారిలో రెండో కుమార్తె అయిన కుమారి మరణించడంతో ఇంటి పనుల్లో సహకారంగా ఉండేదని గుర్తుచేసుకుని తలిదండ్రులు రోదిస్తున్నారు. పుల్లల కోసం వెళ్లి మృత్యువాత పడటం కుటుంబ సభ్యులకు శోకాన్ని మిగిల్చింది.

ఎమ్మెల్యే సత్యప్రభ పరామర్శ

ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యులను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శించారు. బంధువులు, పోలీసులను వివరాలు అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి న్యాయం చేకూరేలా చర్యలు తీసుకుంటానని ఆమె భరోసా ఇచ్చారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు 93మంది హాజరు

రాత్రి వరకూ కొనసాగిన తనిఖీ

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో మెగా డీఎస్సీ 2025 ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మెరిట్ అభ్యర్థుల రెండో విడత సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మంగళవారం నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి 10గంటల వరకూ జరిగిన ఈ ప్రక్రియకు 93మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎంఈవో, గెజిటెడ్ హెచ్‌ఎం, డిప్యూటీ తహసీల్దార్, ఎంఐఎస్ ఆపరేటర్లతో కూడిన 5 తనిఖీ బృందాలు అభ్యర్థుల పరిశీలన చేపట్టారు. సోమవారం సాయంత్రం నుంచి అభ్యర్థులకు కాల్‌లెటర్లు జనరేట్ కాగా వారంతా వచ్చి సర్టిఫికెట్లను వెరిఫై చేయించుకున్నారు. తనిఖీ వివరాలను ఈ బృందాలు ఆన్‌లైన్ చేశారు. తనిఖీ జరుగుతున్న తీరుని కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్, డీసీఈబీ కార్యద వెంకట్రావు పరిశీలించగా, గొల్లప్రోలు ఎంఈవో శివప్రసాద్ తదితరులున్నారు.

విమానంలో వచ్చి...

కాల్‌లెటర్లు అయిన అభ్యర్థులు కొంతమంది ఆన్‌లైన్‌లో వాటిని డౌన్‌లోడ్ చేసుకోలేదు. హాజరు కాని వారి వివరాలు గుర్తించిన తనిఖీ బృందాల్లోని ఎంఈవోలు అభ్యర్థులకు ఫోన్‌లో సమాచారం అందించారు. చివరి క్షణంలో సమాచారం అందడంతో హైదరాబాద్‌లో ఉండిపోయిన ఇద్దరు అభ్యర్థులు విమానంలో రాజమహేంద్రవరం వరకూ వచ్చి అక్కడ నుంచి కారులో చేబ్రోలుకు మంగళవారం రాత్రి చేరుకున్నారు. మరో అభ్యర్థి శ్రీకాకుళంలో ఉండగా సమాచారం అందడంతో కారులో నేరుగా హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న పలువురు ఆలస్యంగానే తనిఖీకి వచ్చారు. రాత్రి పది గంటలకు ప్రక్రియ పూర్తైంది.



వెరిఫికేషన్ కోసం హైదరాబాద్ నుంచి చేబ్రోలుకు వచ్చిన అభ్యర్థిని

చోరీ చేసి చిక్కారు..

రాణేలంకలో ఇద్దరు యువకులను చెట్టుకు కట్టేసి పోలీసులకు అప్పగింత



రాణేలంకలో యువకులను చెట్టుకు కట్టిన దృశ్యం

ముమ్మిడివరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి దోపిడీకి పాల్పడిన ఇద్దరు యువకులను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం రాణేలంకలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన చేబోలు సుబ్రహ్మణ్యం తన ఇంటిని అద్దెకు ఇచ్చి అమలాపురంలో ఉంటున్నాడు. ఆ ఇంట్లో అద్దెకు ఉంటున్నవారు కూడా ఇటీవలే ఖాళీ చేయడంతో ఇంటికి తాళం వేశారు. అయితే సుబ్రహ్మణ్యం తన పాత ఇత్తడి సామాన్లను ఒక గదిలో పెట్టి తాళాలు వేశాడు. మంగళవారం ఉదయం ముగ్గురు వ్యక్తులు మోటారు రిక్షాలో వచ్చి ఇంటి తలుపులను పగులకొట్టి గదిలో ఉన్న పాత ఇత్తడి సామాగ్రిని దొంగిలించుకుపోతుండగా స్థానికులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా ఇద్దరు దొరకగా మరో వ్యక్తి ఇంజను రిక్షాలో పరారయ్యాడు. వారిని చెట్టుకు కట్టి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి వారిని ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

మోతుగూడెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి నివారణ చర్యల్లో భాగంగా అల్లూరి జిల్లా డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్‌కు వచ్చిన సమాచారం మేరకు డొంకరాయి గ్రామశివారు ఉండి వద్ద మంగళవారం జరిపిన తనిఖీల్లో జెండాకూపి గ్రామానికి చెందిన కిలో సాము వద్ద నుంచి ఆరు కిలోల గంజాయిని స్వాధీనపర్చుకున్నారు. దీని విలువ రూ.33 వేలు వరకు ఉం టుంది. మధ్యవర్తుల సమక్షంలో ముద్దాయి కిలో సామును రిమాండ్‌కి తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఘర్షణపై కేసు నమోదు

రావులపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ జన్మదిన వేడుకల్లో భాగంగా నిర్వహించిన బైక్ ర్యాలీలో తలెత్తిన ఘర్షణపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి... రావులపాలెం మండలం ఈతకోటలో పవన్‌పుట్టినరోజు సందర్భంగా స్థానిక గౌడ రామాలయం వద్ద సైలెన్సర్లు లేకుండా కొంతమంది బైకులతో ర్యాలీ నిర్వహిస్తుండగా, అక్కడున్నవారు ఈ సౌండ్ ఏమిటని ప్రశ్నించారు. దీంతో వివాదం తలెత్తడంతో మట్టా సూర్యనారాయణ, మట్టా సుబ్బలక్ష్మి, మానే ఐశ్వర్యకు గాయాలయ్యాయి. ప్రస్తుతం వారు కొత్తపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

న్యాయం చేయాలి

- రంపచోడవరంలో విద్యార్థి అనుమానాస్పద మృతిపై కొనసాగుతున్న ఆందోళన
- రెండో రోజూ రోడ్డెక్కిన బాధిత కుటుంబ సభ్యులు, ఆదివాసీ సంఘాలు
- ఇంకా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలోనే మృతదేహం .. పూర్తి కాని పోస్టుమార్టం



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు, ఆదివాసీ సంఘాల నాయకులు

రంపచోడవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అల్లూరి జిల్లా రంపచోడవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి వివేకానంద రెడ్డి (14) అనుమానాస్పద మృతిపై బంధువులు, ఆదివాసీ సంఘాలు రెండోరోజైన మంగళవారమూ ఆందోళన కొనసాగించారు. విద్యార్థి మరణానికి బాధ్యులైన వారిపై చర్యలు, బాధిత కుటుంబానికి న్యాయం, ఐటీడీఏ నుంచి సరైన స్పందన లేకపోవడంతో రోడ్డెక్కారు. విద్యార్థి అదృశ్యమైంది మొదలు, మరణించే వరకూ తల్లితండ్రులకు సమాచారం ఇవ్వకపోవడం, విద్యార్థులను పర్యవేక్షించాల్సిన వారెవరూ విద్యార్థులు వాగుకు వెళ్లే సమయానికి లేకపోవడమే సదరు విద్యార్థి మరణానికి కారణమంటూ వారంతా ఆరోపిస్తున్నారు. ఇందుకు బాధ్యులుగా ఐటీడీఏ ఉన్నతాధికారుల నుంచి పాఠశాల వార్డెన్ వరకూ అందరిపైనా క్రిమినల్ కేసులు, మృతుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, పరిహారం ఇప్పించాలని డిమాండ్‌చేశారు. కాగా, విషయం తెలుసుకున్న గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వచ్చి మాట్లాడినప్పటికీ ఐటీడీఏ నుంచి స్పందన లేకపోవడంతో సాయంత్రం వరకూ ఆందోళన కొనసాగింది. అయితే ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆందోళనకారుల వద్దకు రాలేకపోవడం, ఆదివాసీలు ఎంతకీ ఆందోళన విరమించకపోవడంతో రెండు రోజులైనా మృతదేహానికి శవపరీక్ష జరగకపోవడంతో రంపచోడవరం డీఎస్పీ ప్రశాంతకుమార్ మంగళవారం సాయంత్రం వెళ్లి ఆందోళనకారులతో చర్చించారు. తమకు జరగాల్సిన న్యాయం జరిగేవరకూ తాము తగ్గేదే లేదని, ఉన్నతాధికారులతో సహా బాధ్యులందరిపైనా క్రిమినల్ కేసులు పెట్టాలని ఆయన్ని బాధితులంతా కోరారు. దీంతో బంధువులు, ఆందోళనకారులు ఆసుపత్రి వదిలి వెళ్లిపోయారు. విద్యార్థి మృతదేహం ఆసుపత్రి మార్చురీలోనే ఉండిపోయింది. ఇంకా పోస్టుమార్టం పూర్తి కాలేదు. ఆందోళనలో ఆదివాసీ నాయకులు పల్లాల లచ్చి రెడ్డి, వెదుళ్ల లచ్చిరెడ్డి, సీపీఎం కిరణ్, మట్ల వాణిశ్రీ, బాలు అక్కిన, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

మలికిపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలంలోని తూర్పుపాలెంలో చోరీకి పాల్పడిన ఆర్.తరఫ్దార్‌ను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ బీ.సురేష్ తెలిపారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు మంగళవారం మధ్యాహ్నం తూర్పుపాలెం బస్టాండు వద్ద తరఫ్దార్‌ను అదుపులోకి తీసుకుని ఆయన వద్ద నుంచి 37 గ్రాముల బంగారం, చోరీ సొత్తును రికవరీ చేసినట్టు తెలిపారు. తరఫ్దార్ జీవనోపాధి నిమిత్తం వెస్ట్‌బెంగాల్ నుంచి వచ్చి తూర్పుపాలెంలో కొన్నాళ్లు చికెన్ షాపు, ఇటుక బట్టీల్లో పనిచేసేవాడు. చోరీ కేసును వెంటనే ఛేదించిన ఎస్‌ఐను జిల్లా ఎస్పీ అభినందించినట్టు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

మామిడికుదురు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నానికి చెందిన ఒబిలిశెట్టి రవిచంద్రబాల బాలాజీ-లీలావెంకట సత్యవాణి దంపతులు రూ.లక్ష విరాళంగా అందించారు.

ప్రసవ వేదన

- ఆదివాసీ మహిళకు పురిటి నొప్పులు
- ఆసుపత్రికి తరలించేందుకు నానా అగచాట్లు
- కూనవరం మండలం వలస ఆదివాసీ గ్రామం కన్నాపురంలో ఘటన

కూనవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దట్టమైన అడవి, కటిక చీకటి, జోరు వాన, వెలుతురు లేకపోవడంతో సెల్‌ఫోన్ లైట్ సాయం... వీటన్నింటి మధ్య ఓ గిరిజన మహిళ ప్రసవం.. ఇన్ని అవరోధాలు ఎదుర్కొని ఆమె పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే ... కూనవరం మండలంవలస ఆదివాసీ గ్రామమైన కన్నాపురంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆది వాసీ మహిళ రవ్వ దేవమ్మకు సోమవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో నరకయాతన పడింది. కాగా, ఆసుపత్రికి తీసుకెళ్దామంటే ఆ గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేదు. అయితే ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మైదాన ప్రాంతంలో ఉన్న నర్సింగపేట వచ్చి అక్కడి ఆశా వర్కర్‌కు సమాచారం అందించాడు. దీంతో ఆమె 108కు ఫోన్ చేయగా వాహనం రాగానే ఆమెను ఎక్కించుకుని వెళ్తుండగా సదరు వాహనం సగం దూరం వెళ్లి ఆగిపోయింది. దీంతో రామ్మోహనరావు, ఆశ వర్కర్ లక్ష్మి నడుచుకుంటూ కన్నాపురానికి చేరుకుని దేవమ్మకు ప్రథమ చికిత్స అందించిన అనంతరం ఆమెను నడిపించుకుంటూ తిరిగి బయలుదేరారు. కాగా రహదారి గుంతలుగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వచ్చింది. ఈ లోగా దేవమ్మకు పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీనికి తోడు జోరు వాన మొదలవడంతో గొడుగు పట్టుకుని సెల్‌ఫోన్ లైట్ సహా యంతో దట్టమైన అడవిలో ప్రసవించే విధంగా చికిత్స ప్రారంభించారు. చివరకు మగ బిడ్డకు జన్మనివ్వడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ప్రస్తుతం ఆమెను, పసిబిడ్డను కూనవరం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం తల్లీ, బిడ్డా క్షేమంగా ఉన్నారు.



ప్రసవించిన తర్వాత దేవమ్మ, పసిబిడ్డను 108లో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

చెందుర్తిలో యూరియా కోసం వాగ్వాదం

గొల్లప్రోలు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. దీనికోసం తోపులాటలు, వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. గొల్లప్రోలు మండలం చెందుర్తి లోని రైతుసేవా కేంద్రానికి మంగళవారం యూరి యా స్టాకు వస్తుందనే సమాచారం రావడంతో చెందుర్తి, పరిసర ప్రాంతాల రైతులు భారీగా చేరుకున్నారు. తీరా లారీ ఎంతకీ రాకపోవడం, వచ్చినా సకాలంలో పంపిణీ చేపట్టకపోవడంతో తెల్లవారుజాము నుంచి పడిగాపులు కాసిన రైతులు సహనం కోల్పోయారు. దీంతో తోపులాటలు, వాగ్వాదాలు జరిగాయి. 20 టన్నుల యూరియా వచ్చినప్పటికీ సగం మంది రైతులకు కూడా సరిపోకపోవడంతో ... అందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంపిణీ సక్రమంగా చేయడం లేదని వారంతా మండిపడ్డారు. తీసుకున్న వారే మరలా తీసుకుంటున్నారని ఆరోపించారు.




రైతుల మధ్య తోపులాట

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

- రైలు ఢీకొని ఒకరు ... రోడ్డు ప్రమాదంలో గాయపడి మరొకరు ... శబరి, గోదాట్లో మరో ఇద్దరు ...

కొవ్వూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు, పశివేదల రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం ఉదయం గుర్తుతెలియని దాదాపు 45 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు తాడేపల్లిగూడెం జీఆర్పీ ఎస్‌ఐ పీ.అప్పారావు తెలిపారు. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇతడి ఒంటిపై తెలుపురంగు చిన్నచారలు కలిగిన పొడవు చేతుల షర్ట్, ఆకుపచ్చ రంగుపై ఎరుపురంగు పువ్వుల డిజైన్ లుంగీ, రంగుల టర్కీ టవల్ ఉన్నాయన్నారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు 9490617090, 99480 10061 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

ఆలమూరు: ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు ఆలమూరు ఎస్‌ఐ జీ.నరేష్ తెలిపారు. వివరాలివి... రావులపాలెం మండలం రావులపాడుకి చెందిన కటకం మోహనరావు (52) రాజమహేంద్రవరం నుంచి బైక్‌పై రావులపాడుకు వస్తుండగా ఆలమూరు మండలం జొన్నాడ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఎక్స్‌ఎల్ ద్విచక్రవాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో గాయపడిన మోహనరావును రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గుర్తుతెలియని మృతదేహం

వీఆర్‌పురం : శబరి నదిలో గుర్తు తెలియని మృతదేహం కొట్టుకొచ్చింది. ఈ సంఘటన వీఆర్‌పురం మండలంలో మంగళవారం జరిగింది. వీఆర్‌పురం ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నమట్టపల్లి పంచాయతీ పరిధిలోని పత్తిపాక శివారులోని వరద నీటిలో మృతదేహం (పురుషుడు) కొట్టుకు వచ్చిందని, వయస్సు సుమారుగా 30 నుంచి 35 వరకు ఉంటుందన్నారు. మృతుడు ఎరుపురంగు షాట్ మాత్రమే ధరించి ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు. అలాగే నడుముకు పసుపు, ఎరుపు రంగు మొలతాడు కలిగి ఉన్నాడని, ఎవరైనా గుర్తుపడితే ఫోన్‌నెంబర్లు 9490617851, 95994 99366 కు తెలియచేయాలన్నారు.

మామిడికుదురు: గోదావరి నదిలో వృద్ధుడు గల్లంతైన సంఘటన మంగళవారం జరిగింది. బి.దొడ్డవరం గ్రామానికి చెందిన ఒలుపు కార్మికుడు రవణం సాయిబాబు (78) బహిర్భూమికి వెళ్లి గోదావరి నదిలో కొట్టుకుపోయినట్టు కుటుంబ సభ్యులు తెలియజేశారు. గల్లంతైన మృతుడి కోసం రెండు పడవల సహాయంతో రెవెన్యూ అధికారులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఏవిధమైన ఆచూకీ తెలియరాలేదు. దీనిపై సాయిబాబు కుమారుడు పల్లంరాజు పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

హత్యా నేరం కేసులో వ్యక్తికి ఏడేళ్ల జైలు, జరిమానా

- తాడేపల్లిగూడెం కోర్టు తీర్పు

నల్లజర్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం చీపురుగూడెంకి చెందిన చల్లారి వెంకట్రావును అదే గ్రామానికి చెందిన కూసపం బాబూరావు 2021లో ఇనుప రాడ్డుతో తలపై మోదడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో కోర్టు విచారణ అనంతరం నేరు రుజువు కావడంతో మంగళవారం తాడేపల్లిగూడెం కోర్టు బాబూరావుకు ఏడేళ్ల జైలు, రూ.20వేల జరిమానా విధించి నట్టు నల్లజర్ల పోలీసులు తెలిపారు. అప్పట్లో వెంకట్రావు ఇంటి వద్ద కల్లు దుకాణం ఉండేది... అక్కడకి కల్లు తాగడానికి వచ్చిన బాబూరావును డబ్బులు అడగ్గా... ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇరువురూ కొట్టుకున్న సమయంలో బాబూరావుకు పక్కనే ఉన్న ఇనుప రాడ్డు చేతికి అందడంతో వెంకట్రావు తలపై కొట్టడంతో మృతిచెందాడు.

నేడు సామర్లకోట మండల పరిషత్ సమావేశం

సామర్లకోట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వ సభ్యసమావేశం బుధవారం ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో జరుగనున్నట్టు ఎంపీడీవో కరక హిమమహేశ్వరి తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారంపై చర్చించనున్నందున సమావేశానికి అందరు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు,పీఏసీఎస్ అధ్యక్షులు హాజరవ్వాలని కోరారు.

ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలి

ఎమ్మెల్యే చినరాజప్ప


మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, సెప్టెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని 31 వార్డుల్లో వివిధ అభివృద్ధి పనుల నిర్మాణం నిమిత్తం సుమారు రూ.4.50 కోట్ల నిధులు మంజూరైనందు ప్రాధాన్యతా క్రమంలో పనులు వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలతోనూ పూర్తిచేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం కమిషనర్ చాంబర్‌లో కమిషనర్ ఏ. శ్రీవిద్య, మున్సిపల్ డీఈ నరసింహారావు, ఏఈ శేఖర్‌తో ఎమ్మెల్యే సమీక్షించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి, కౌన్సిలర్లు బలుసు శ్రీనివాసు, యార్లగడ్డ జగదీష్, తెలుగుదేశం పార్టీ నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, కంటే జగదీష్‌మోహన్(బాబు) పాల్గొన్నారు. ప్రధానంగా కాపు కల్యాణమండపం నిర్మాణ పనులపై మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. అనంతరం విలేకర్లతో ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సంక్షోభంలో ఉన్నా ప్రజల కోసం ప్రభుత్వం సంక్షేమాన్ని అందిస్తుందన్నారు. ముందుగా సామర్లకోట-పెద్దాపురం ప్రధాన రోడ్డు సుందరీకరణలో భాగంగా మఠం సెంటర్ హైమాస్ట్ లైట్ కూడలిలో వాటర్ ఫౌంటెన్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా కమిషనర్‌ను ఆదేశించారు. అందుకు వ్యయప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. అమ్మాణమ్మ నాయుడు కాలనీపోవు రోడ్డులో విశ్వేశ్వరస్వామి గుడి వద్ద శ్మశానం అభివృద్ధి, ప్రహరీ గోడ నిర్మాణం, పార్క్ వంటి పనులపై సత్వరం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంపంగతోట జంక్షన్ నుంచి ఏడీబీ రోడ్డు వరకూ సుమారు 60 మీటర్ల పొడవునా ఉన్న రోడ్డు గోతులతో అస్తవ్యస్తంగా ఉన్నందున సత్వరం సీసీ రోడ్డు నిర్మించాలని అధికారులకు సూచించారు. అంతకుముందు ఆయోధ్యరామపురం సత్తెమ్మ ఆలయం వద్ద రూ.3.30 లక్షలతో నిర్మిస్తున్న అధునాతన పందిరిషెడ్ నిర్మాణపనులను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం మాజేటి నగర్ నందు రూ. 5లక్షలతో వెట్‌మిక్స్ రోడ్డు నిర్మాణ పనులకు కొబ్బరికాయలు కొట్టి శ్రీకారం చుట్టారు. డీఈ నరసింహారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం

మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది చేపట్టిన సమ్మె కారణంగా ప్రభుత్వం తమ వేతనాలు పెంచేందుకు అంగీకరించడంతో కృతజ్ఞతగా సామర్లకోట మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది మంగళవారం ఎమ్మెల్యే చినరాజప్పను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

బి.ప్రత్తిపాడు జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు : 'పాడా' డైరెక్టర్


బి.ప్రత్తిపాడు జంక్షన్‌ను పరిశీలిస్తున్న పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి, అధికారులు

గొల్లప్రోలు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో 216వ జాతీయ రహదారిపై బి.ప్రత్తిపాడు జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నామని పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి తెలిపారు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు, ఫ్లైఓవర్ నిర్మించాలని, ఇందుకు డిప్యూటీ సీఎం చొరవ తీసుకోవాలని కోరుతూ బి.ప్రత్తిపాడు ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆందోళన నిర్వహించి పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన పీడీ నేషనల్ హైవే అథారటీ, పోలీసు అధికారులతో కలిసి ప్రమాదాలు జరుగుతున్న సదరు జంక్షన్‌ను మంగళవారం పరిశీలించారు. తక్షణం జంక్షన్ వద్ద లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. ఉదయం, సాయంత్రం విద్యార్థులు రాకపోకలు సాగించేటప్పుడు, వాహనాల రద్దీ అధికంగా ఉన్న సమయాల్లోనే పోలీసు పెట్రోలింగ్ సిబ్బందిని ఉంచడంతో పాటు ప్రత్యేకంగా పోలీసులను నియమించాలన్నారు. గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ, ఎన్‌హెచ్ అధికారులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి : డీపీవో రవికుమార్


మాధవపట్నంలో చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో రవికుమార్

సామర్లకోట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలంలో అంటురోగాలు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ సిబ్బంది చేస్తున్న కృషికి ప్రజలు సైతం సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ పేర్కొన్నారు. సామర్లకోట మండలం మాధవపట్నం గ్రామంలో వివిధ ప్రాంతాలను డీపీవో మంగళవారం పరిశీలించారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీవో భైరవమూర్తితో కలిసి గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ, ఐవీఆర్ఎస్, కాల్స్ క్లోరినేషన్ నివేదికలను పరిశీలించి పంచాయతీ అధికారులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.సత్యనారాయణ, డీపీఆర్‌సీ టీమ్ రాజా, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వయోజన విద్యా కేంద్రాలు ప్రారంభం


గొల్లప్రోలులో అక్షర జ్ఞానంపై అవగాహన కలిగిస్తున్న వాలంటీర్లు, అధికారులు

గొల్లప్రోలు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్, అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గొల్లప్రోలులోని ఎస్సీ కాలనీ, రంగప్పచెరువు వీధి ప్రాంతాల్లో మంగళవారం 3 వయోజన విద్యా కేంద్రాలను ప్రారంభించారు. అక్షర జ్ఞానంపై వయోజనులకు అవగాహన కల్పించారు. వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ పోశయ్య, సహాయ ప్రాజెక్టు అధికారి వాస ంశెట్టి త్రిమూర్తులు, గణాంక అధికారి వీఎస్ ఆనందబాబు, డీఈవో గౌస్ మొహిద్దీన్, భవానీ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ శ్రీదేవి, ఆర్పీలు పాల్గొన్నారు.

పిఠాపురంలో...

పిఠాపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఏర్పాటు చేసిన అక్షరాస్యతా కేంద్రాలను మున్సిపల్ కమిషనరు నామ కనకారావు ప్రారంభించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి అనిశెట్టి వెంకట్రావురెడ్డి, సిటీ మిషన్ మేనేజర్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడికి పుష్కరిణి జలాలతో అభిషేకం


పవిత్ర జలాలతో సంపత్ వినాయకుడిని అభిషేకించేందుకు తరలివస్తున్న భక్తజనం

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయం వద్ద గల సంపత్ వినాయకుడి ఆలయంలో మంగళవారం పుష్కరిణి నదీ జలాలతో అభిషేకించారు. గంగ, యమున, సింధు, కావేరి, సరస్వతి, తుంగభద్ర, కృష్ణా, గోదావరి వంటి 12 నదుల పవిత్ర నదీ జలాలున్న కలశాలతో మంగళవాయిద్యాల నడుమ నగరంలో భక్తజనం భారీ ఊరేగింపు నిర్వహించారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి కనపర్తి నాగేశ్వరరావు, ఈవో శ్రీనివాసుల ఆధ్వర్యంలో పుష్కరిణి నదీ జలాలు, తీర్థప్రసాదాలను భక్తులను పంపిణీ చేశారు. ఏటా స్వామివారికి పుష్కరిణి నదీ జలాలతో అభిషేకించడం ద్వారా దేశంలో ప్రజలంతా పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని పూజించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పుట్టినరోజు వేడుకలు

● రక్తదాన, వైద్య శిబిరాలు ● రోగులకు పండ్లు, దుస్తులు, దుప్పట్ల పంపిణీ


పిఠాపురంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ ఉదయ శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే కొణిదెల పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను నియోజకవర్గంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పిఠాపురం జైగణేష్ దేవస్థానంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబుల పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర థియేటర్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదాతలను అభినందించారు. అక్కడే భారీ కేక్‌ను కట్ చేశారు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. గోకులం గ్రాండ్ వద్ద జనసేన నాయకురాలు డాక్టర్ దివ్యరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరంలో పాల్గొని రోగులకు మందులు పంపిణీ చేశారు.

పిఠాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి): బి.ప్రత్తిపాడులో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి 500మంది రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పిఠాపురం కార్తికేయ ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి అధినేత మొగలి కాశీవిశ్వనాథ్, కార్తికేయ, సూర్యగ్లోబల్ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): పవన్ జన్మదిన వేడుకలను రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ నివాసంలో నిర్వహించారు. కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ తుమ్మల రామస్వామి, కాకినాడ సూపర్ బజార్ చైర్మన్ పెసంగి ఆదినారాయణ, జనసేన నాయకులు ఆకుల వెంకటరమణ, నల్లం శ్రీనివాస్, నున్న దొరబాబు, వివిస్వామి, కార్యకర్తలు, వీర మహిళల సమక్షంలో కేక్ కట్ చేసి చేశారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో జనసైనికుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. గ్రామస్తులకు, ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు. జనసైనికులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, కొణమర్తి రాంబాబు, సానా నాగు, గణేశుల గంగ, సురేష్, సతీష్, సాన కృష్ణ, సానా రమేష్, బోడపాటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం మాధవపట్నంలో వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎంపీ తంగెళ్ళ ఉదయశ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) హాజరై కేక్ కట్ చేశారు. జనసేన నాయకులు ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎంపీ ప్రారంభించారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలను తుమ్మల అందజేసారు. ఎంపీ, చైర్మన్లను కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. పన్నీరు వెంకటేశ్వరరావు, పెంకే వెంకటేష్, వెంకటరమణ, పిల్లి బండబాబు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు. సామర్లకోట జనసేన నాయకులు ప్రభుత్వాసుపత్రిలో పండ్లు, రొట్టెలు, పాలు అందజేశారు.

కరప (ఆంధ్రజ్యోతి): కరపలో వాకర్స్ క్లబ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పారిశుధ్య కార్మికులకు అల్పాహారం అందించారు. పెదపూడి మండలం గొల్లల మామిడాడలో వేడుకలకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి జనసేన ఇన్‌చార్జ్ మర్రెడ్డి, గోదావరిజిల్లాల సమన్వయకర్త రావాడ నాగులు హాజరయ్యారు. స్థానిక ఫంక్షన్‌హాల్‌లో 100మంది వృద్ధులు, మహిళలకు దుప్పట్లు, 30మంది పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు అందజేశారు. భారీ కేక్ కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): వాకలపూడిలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ హోమ్ ఫర్ సీనియర్ సిటిజన్స్ వృద్ధాశ్రమంలో ఎమ్మెల్యే పంతం నానాజీ కుమారుడు పంతం సందీప్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే పంపించిన పండ్లు, ఆహారాన్ని వృద్ధులకు పంపిణీ చేశారు. ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ శిరంగు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బిందిరి విరీష, పార్టీ నాయకులు మాదారపు తాతాజీ, న్యూటన్ ఆనంద్, కుడపూడి వెంకటబాలాజీ, సంతోష్, జీని శ్రీనివాస్ పాల్గొన్నారు. 2వ డివిజన్ ఇన్‌చార్జి గోపు వెంకటరమణ ఆధ్వర్యంలో సౌజన్యనగర్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. చెత్తా,వ్యర్థాలు తొలగించారు.


సామర్లకోట: మాధవపట్నంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీ, తుమ్మల

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): పి.మల్లవరం గొల్లబాబు కల్యాణమండపంలో జనసైనికుడు వేగి రుద్రనాగ భైరవప్రసాద్ ఆధ్వర్యంలో మెగారక్తదాన శిబిరం ఏర్పాటుచేయగా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వైడీ రామారావు ప్రారంభించారు. మెడికల్ రిప్రజెంట్లు, జనసైనికులు 150మంది పాల్గొని తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదానం చేశారు. తాళ్లరేవు జనసేన నేతలు పోతుల రాజు, మత్తుర్తి మణికంఠ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను సత్కరించి దుస్తులను పంచారు. ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. జనసేన నేత సూరంపూడి కుమార్ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత భోజనం పంపిణీ చేశారు.

యూరియా కొరత లేదు.. ఆందోళన వద్దు : జేడీఏ


వాకాడలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న జేడీఏ విజయ్‌కుమార్

కరప, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎక్కడా యూరియా కొరత లేదని, లేనిపోని అపోహలకు పోయి రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎన్.విజయ్‌కుమార్ స్పష్టంచేశారు. కాకినాడ జిల్లా కరపమండలం వాకాడ గ్రామంలో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రైవేట్ ఎరువుల దుకాణాలు, సొసైటీలు, రైతు సేవాకేంద్రాల్లో యూరియా నిల్వలు ఉంచామని, ప్రస్తుత సార్వా సీజన్‌కు అవసరమైన యూరియాను మాత్రమే పట్టుకెళ్లాలని, భవిష్యత్ పంటలకు ఇప్పుడే స్టాక్ పెట్టుకుని కొరతను సృష్టించవద్దని విజ్ఞప్తిచేశారు. లిక్విడ్ రూపంలో అందుబాటులో ఉన్న నానో యూరియాను వినియోగించి మంచి ఫలితాలు పొందవచ్చని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ట్రాక్టర్లు, దుక్కి దున్నే యంత్రాలు, రోటవేటర్లు, 80శాతం సబ్సిడీపై డ్రోన్లను అందిస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సార్వాసాగులో చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

నేడు సామూహిక ఎలుకల నిర్మూలన

జిల్లా వ్యాప్తంగా బుధవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపడుతున్నట్టు జేడీఏ ఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని రైతు సేవాకేంద్రాల్లో రైతులకు ఉచితంగా ఎలుకల మందును పంపిణీచేస్తామని, రైతులు సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలని, అప్పుడే సత్ఫలితాలను పొందవచ్చని సూచించారు. నాణ్యమైన టార్పాలిన్లను అందించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, రైతులు తమ పేర్లను రైతు సేవాకేంద్రాల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ కె.బాబూరావు, ఏవో ఇమ్మిడిశెట్టి సత్య, వేములవాడ సొసైటీ చైర్మన్ దూడల నారాయుడు, ఏఈవోలు ఎం.సతీష్,బండారు శ్రీరాములు తదితరులు ఉన్నారు.

మాజీ సీఎం వైఎస్ వర్ధంతి


పిఠాపురం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించిన మాజీ ఎంపీ గీత

పిఠాపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ ద్వారా మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ తెలిపారు. వైఎస్ వర్ధంతి సందర్భంగా పిఠాపురం వైసీపీ కార్యాలయంలో, మున్సిపల్ కార్యాలయం వద్ద గల రాజశేఖరరెడ్డి విగ్రహానికి గీత, పార్టీ నాయకులు మంగళవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కరప (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీ ఎదురుగా ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతికుమార్, వెలుగుబంటి సీతారామరాఘవ, కొత్త నాగలక్ష్మి రవి, చింతా నాగలక్ష్మిబుజ్జి, కమిడి మంగాదేవిశంకర్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ జంక్షన్ వద్ద వైఎస్ విగ్రహానికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దవులూరి దొరబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రూరల్లో జడ్పీటీసీ గవరసాన సూరిబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. వైస్ చైర్మన్ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు చెరువుగట్టుసెంటరు, సంతపేట సెంటర్‌లో వైఎస్ విగ్రహాలకు కార్యకర్తలు నివాళిలర్పించారు.

డ్రైనేజీల్లో పూడిక తొలగింపు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

కొత్తపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు నాగులాపల్లిలో మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించే చర్యలు చేపట్టారు. పూడుకుపోయిన డ్రైనేజ్‌లు, పట్టించుకోని యంత్రాంగం అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై అధికారులు స్పందించారు. కొత్తపల్లి ఎంపీడీవో కర్రి హరికృష్ణ సత్యారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం పంచాయతీ పారిశుధ్య కార్మికులు మురుగు కాలువల్లో పూడిక తొలగించారు.

అన్ని ప్రాంతాల్లో వేటకు అవకాశం కల్పించాలి


అమరావతిలో మత్స్యశాఖ కమిషనరు నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న వర్మ, నాయకులు

పిఠాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సముద్రంలోని అన్ని ప్రాంతాల్లో వేటకు అవకాశం కల్పించాలని, ఆయిల్ డ్రిల్లింగ్‌తో నష్టపోతున్న మత్స్యకారులకు పరిహారం అందజేయాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, నియోజకవర్గానికి చెందిన మత్స్యకార సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం అమరావతిలో రాష్ట్ర మంత్రి కొలు రవీంద్ర, మత్స్యశాఖ కమిషనరు నాయక్, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌ను కలిసి మత్సకార సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అంతర్వేది, గొల్లపాలెం, కీలకలదండు తదితర ప్రాంతాల్లో ఇక్కడ మత్స్యకారులు వేటకు వెళ్లి మత్స్యసంపదను పట్టుకునేందుకు వీలు కల్పించాలన్నారు. ఓఎన్‌జీసీ, రిలయన్స్ ఆయిల్ డ్రిల్లింగ్ కార్యాకలాపాల వలన మత్స్యసంపదకు నష్టం వాటిల్లుతుందని, కాకినాడ, ముమ్మిడివరం, యానాం మత్స్యకారులకు ఇచ్చినట్లే పిఠాపురం నియోజకవర్గానికి చెందిన వారికి పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. సముద్రపు కోత నివారణకు కోనపాపపేట వరకూ రక్షణగోడ నిర్మాణం చేపట్టాలని, నిర్మాణంలో ఉన్న ఫిషింగ్ హార్బర్ వద్ద బోట్లు ల్యాండింగ్‌కు వీలు పనులు చేపట్టేందుకు రూ.40కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఈ సమస్యలపై ఇప్పటికే ముఖ్యమంత్రికి వినతి అందజేయగా పరిష్కారం కోసం అధికారులకు ఆదేశాలిచ్చారని వర్మ తెలిపారు.

'స్మార్ట్‌కార్డులతో సేవలు మరింత సులభం'


పెనుగుదురులో స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

కరప, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ కార్డులతో లబ్ధిదారులకు మరింత సులభంగా సేవలందించవచ్చని తహశీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్ తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న 45 రేషన్ దుకాణాల్లో మంగళవారం జరిగిన స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలవ్యాప్తంగా 25, 555 కుటుంబాలకు స్మార్ట్ కార్డులను పంపిణీచేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 2,500 కుటుంబాలకు అందించామన్నారు. నిత్యవసర సరుకుల పంపిణీలో పారదర్శకతను పెంచేందుకు ఈ స్మార్ట్‌కార్డులు దోహదపడతాయన్నారు. లబ్ధిదారులు వీటిని ఉపయోగించి సకాలంలో రేషన్ సరుకులను పొందవచ్చన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన పంపిణీలో కూటమి నాయకులు ముద్రగడ రమేష్, దేవు వెంకన్న, బండారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, రెడ్డిపల్లి నారాయణరావు, తుమ్మలపల్లి మాచర రావు, తుమ్మలపల్లి గోవిందరాజులు, గంటా వీరన్నచౌదరి, సైనవరపు భవానీశంకర్, యాళ్ల పండు, రెవెన్యూ సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

ఏడిద చరణ్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం

మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వల్లూరి రాజా రవీంద్రకుమార్

కొత్తపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం మూలపేటలో వాలీబాల్ స్తంభం ఏర్పాటులో కరెంటు షాక్‌కు గురై మృతిచెందిన ఏడిద చరణ్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వల్లూరి రాజా రవీంద్రకుమార్ భరోసా ఇచ్చారు. మూలపేటలో బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి సాయం అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కొత్తపల్లి మండలాధ్యక్షులు మోర్త రవి, కాకాడ శ్రీనివాస్, రామిశెట్టి రాంబాబు, కింతాడ ఏలీషా, ఏడిద కిరణ్, ముమ్మిడివరపు ప్రసాద్ పాల్గొన్నారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడికి సత్కారం


సూర్యప్రకాశ్‌రావును సత్కరిస్తున్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన వల్లూరి సూర్య ప్రకాశ్‌రావును కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మంగళవారం సత్కరించారు. కాకినాడ కలెక్టరేట్ ప్రాంగణంలో ఆయనకు శాలువా కప్పి సత్కరించి అభినందించారు. జిల్లాలో రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. అసోసియేషన్ కార్యదర్శి మొగలి నాని, ట్రెజరర్ పెదిరెడ్ల బాబ్జి పాల్గొన్నారు.

విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నాగమల్లితోట జంక్షన్‌లోని శ్రీరాజ రాజేశ్వరి ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల సంరక్షణ అధికారి జి.విజయకుమారి బాలలకు జీవించే హక్కు, రక్షణ, అభివృద్ధి, పాల్గొనే హక్కుల ప్రాధాన్యతను వివరించారు. లైంగిక వేధింపులు, మంచి చెడు స్పర్శ, వివాహాల కనీస వయస్సు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కౌన్సిలర్ బిదుర్గారాణి మాట్లాడుతూ పిల్లలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే 1098కి సమాచారం అందించాలన్నారు. విద్యార్థులతో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.బాలగణేష్ రెడ్డి, అధికారులు, ట్రైనింగ్ ఆఫీసర్లు ఉన్నారు.

ఉపకార వేతనాలపై..

పెద్దాపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపకార వేతనాలపై మంగళవారం అవగాహన కల్పించారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజక్ట్ మేనేజర్ బర్రె నాగేశ్వరరావు విద్యార్థులకు వివరించారు. అభ్యర్థులకు రాత పరీక్షలను నిర్వహించి మెరిట్ సాధించిన విద్యార్థులకు ఏడాదికి రూ.50 వేలు చొప్పున నాలుగేళ్ల పాటు ఉపకార వేతనాలను అందిస్తామన్నారు. ఉపకార వేతనాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ స్కాలర్‌షిప్స్ డాట్ రిలయన్స్ ఫౌండేషన్ డాట్ వోఆర్జీ వెబ్‌సైట్ సందర్శించాలన్నారు.

ప్రత్యేక పారిశుధ్య పనులు


అరట్లకట్టలో దోమల మందు పిచికారీ చేయిస్తున్న సర్పంచ్ సత్యవేణిగణేష్

కరప, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అరట్లకట్టలో దోమల నివారణకు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతున్నట్టు సర్పంచ్ గోపి సత్యవేణిగణేష్ తెలిపారు. మలేరియా, డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తిచేస్తున్న దోమలను నివారించడానికి గ్రామంలోని అన్ని డ్రెయిన్‌లలో ఎబేట్ మందును పిచికారీ చేయిస్తున్నట్టు చెప్పారు. ఇంటి పరిసరాలు, పబ్లిక్ ప్రదేశాల్లో చెత్త, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి చెత్త నుంచి సంపద తయారీకేంద్రానికి తరలిస్తున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి రామ్‌జీ హీరాలాల్, సచివాలయ, ఆరోగ్యశాఖ సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల హాజరు పెంచాలి

సామర్లకోట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల హాజరు పెంచేందుకు సిబ్బంది కృషిచేయాలని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరక్టర్ సీహెచ్.లక్ష్మీ పేర్కొన్నారు. సామర్లకోట అర్బన్ పరిధిలో సంపంగతోట అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. పూర్వప్రాథమిక విద్యార్థుల సంఖ్యను పరిశీలించి ఆవాసప్రాంతంలో చిన్నారులందరినీ చేర్పాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రోజూవారీ పౌష్టికాహారాన్ని విధిగా చిన్నారులచే తినిపించాలన్నారు. అనంతరం టీహెచ్‌ఆర్, స్టాఫ్ అటెండెన్స్ తదితర రిజిష్టర్లను పరిశీలించారు. పెద్దాపురం మండలం రాయభూపాలకొత్తూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని పీడీ లక్ష్మి పరిశీలించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ హెచ్చరించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో మంగళవారం పోలీసుల గ్రామ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులతో సమావేశమయ్యారు. పశువధ, అక్రమ గ్రావెల్ తవ్వకాలు, జూదాలు వంటి కార్యక్రమాలు జరిగితే తక్షణం సమాచారం అందించాలని కోరారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. గొల్లప్రోలు పోలీసు సిబ్బంది ఉన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

అశోక్‌బాబుకు యనమల పరామర్శ

తునిరూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబును మంగళవారం మాజీ మంత్రి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పరామర్శించారు. ఇటీవల అశోక్ బాబు శస్త్రచికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. యనమల స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆయన్ను పరామర్శించి యోగ, క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట యనమల రాజేష్, చింతమనీడి అబ్బాయి, ఇనిగంటి సత్యనారాయణ ఉన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు


మోతుగూడెంలో జన సైనికుల బైక్ ర్యాలీ

రంపచోడవరం, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): రంప చోడ వరంలో రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళ వారం ఘనంగా నిర్వహిం చారు. మండలంలోని ఆయా ప్రాంతాల్లో కేక్ కట్ చేశారు. జనసేన నియోజకవర్గ నాయకుడు కుర్ల రాజశేఖరరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసరావు, పండా వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చింతూరు, (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలను మంగళ వారం చింతూరులో కూటమి నాయకులు ఘనంగా జరిపారు. అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జనసేన మండల శాఖ అధ్యక్షుడు మడివి రాజు, జనసేన నాయకుడు పయ్యాల నాగేశ్వరరావు, సుజాత, టీడీపీ నాయకులు ఎండీ జహంగీర్, మంగవేణి, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మయ్యరాజు, సుప్రజ, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేటలో..


దేవీపట్నం మండలం ఇందుకూరుపేటలో కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

దేవీపట్నం, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఇందుకూరుపేటలో నిర్వహిం చారు. ముందుగా జనసేన జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. దీనికి ముఖ్య అతిథిగా రంపచోడవరం నియోజకవర్గ నాయకులు కుర్ల రాజశేఖర్ హాజరయ్యారు. జనసైనికుల ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో 40 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీఆర్‌పురం, (ఆంధ్రజ్యోతి): మండలంలో డిప్యూటీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరిపారు. మంగళవారం జనసేన మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ ఆధ్వర్యంలో వీఆర్‌పురం, వడ్డిగూడెం, రేఖపల్లి, శ్రీరామగిరి, జీడిగుప్ప తదితర గ్రామాల్లో జనసైనికుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ములకపల్లి పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, రేఖపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. శ్రీరామగిరి సీతారామచంద్రస్వామి, రేఖపల్లి కోటమైసమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన మండల కార్యదర్శి బాగుల అంజన్‌రావు, ఉపాధ్యక్షులు కనుగుల శ్రీనివాస్‌రెడ్డి, ముంజపు సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.


వీఆర్‌పురంలో కేక్ కట్ చేస్తున్న జనసైనికులు

జనసేన బలోపేతానికి కృషి చేస్తాం..

మోతుగూడెం, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు, ఆశయాలు ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని గూడూరు గ్రామ జన సైనికులు అన్నారు. పవన్ కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకొని మంగళవారం గూడూరు నుంచి జన సైనికుల నాయకత్వంలో చింతూరు వరకు బైక్ ర్యాలీ నిర్వహిం చారు. కార్యక్రమంలో జనసేన సున్నం సూరయ్య, సోడి వెంకయ్య, సున్న మహేష్, సున్నం అరవింద్, మడివి రాకేష్ శర్మ, మడివి ప్రవీణ్, బొద్దెల గంగరాజు, మడివి భీమయ్య, మడివి గంగరాజు, బాడిస సునీత రావు, కట్టం రమేష్, మడివి రమేష్, సున్నం శరత్, జోడి కన్నారావు, మడుగు సురేష్‌సోడి కన్నారావు, మడివి సురేష్ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి


శిక్షణ కార్యక్రమంలో సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్ దొర

చింతూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన ప్రాంతాలను అభివృద్ధిపర్చే క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఆదికర్మ యోగి పథకం ప్రవేశపెట్టిందని చింతూరు ఎంపీడీవో సుండం శ్రీనివాస్‌దొర పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మాస్టర్ ట్రైనర్సు క్షేత్రస్థాయి అధికార బృందాలకు అభివృద్ధి రూపకల్పనపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ దొర ఆయా బృందాలకు పలు సూచనలిచ్చారు. బుధవారం నుంచి ఈ నెల 12 వరకు ఎంపిక చేసిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వరరావు, సీడీపీవో జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆదికర్మ యోగి ద్వారా అభివృద్ధి పనుల గుర్తింపు


మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆదికర్మయోగి అభియాన్‌లో భాగంగా మంగళవారం చింతకర్రపాలెం గ్రామంలో గ్రామ సభ నిర్వహించినట్లు ఎంపీడీవో బాపన్నదొర తెలిపారు. గ్రామంలోని గిరిజనుల అవసరాల నిమిత్తం కల్వర్టు నిర్మాణాలు, సీసీ రోడ్డు, అంగన్వాడీ కేంద్రానికి అప్రోచ్ రోడ్డు తదితర వాటిని గుర్తించామని వీటిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీష్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఖాతా నమోదుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

అడ్డతీగల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మంగళవారం ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఖాతా ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని హసుపత్రి కౌన్సిలర్ నారే వాసు సూచించారు. దేశంలోని పౌరులందరికి డిజిటల్ హెల్త్ ఐడి అందించడం ఈ మిషన్ లక్షమన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పథకంలో భాగస్వాములు కావాలని అవగాహన కల్పించారు.

మణిబాబుకు సన్మానం

జగ్గంపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేవీఆర్ అపార్ట్‌మెంట్‌లో జగ్గంపేట మండలం తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షులు జీను మణిబాబును సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మహేంద్ర మేదర్ల సంఘం ప్రెసిడెంట్ పిల్లి రమణ , రొట్ట ఏసు దొమ్మ బద్రి, రొట్ట సత్తిబాబు, దొమ్మ దుర్గా, రొట్ట అప్పారావు, మొగ్గ ఆనంద్ ఈ సందర్భంగా మాట్లాడారు. మండలంలో టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు సైనికుల్లా పని చేస్తామన్నారు.

పరామర్శ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ముదునూరి మురళీ కృష్ణంరాజును ధర్మవరంలో నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు మంగళవారం పరామర్శించారు. మురళీ కృష్ణంరాజు తండ్రి రామరాజుపై పెట్టిన కేసు పై ఉన్నత అధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని గిరిబాబు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేయకుండా కేసు నమోదు చేయడం దురదృష్టకరమన్నారు.

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు

- జిల్లాలో సేవా కార్యక్రమాలు
- రక్తదాన శిబిరాలు, వైద్య పరీక్షలు



జగ్గంపేట: పూజలు నిర్వహిస్తున్న జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, జనసైనికులు, ప్రత్తిపాడు: పంచాయతీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, జనసేన నేత బాబి తదితరులు

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను జనసేన పార్టీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. రాజపుడిలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. రాజపూడి గ్రామంలో పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో జెండా ఆవిష్కరణలు, కేక్ కటింగ్‌లు నిర్వహించారు. ఆయా జనసేన నేతలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

జగ్గంపేట జయ గారి పెద్దబ్బాయి హాస్పిటల్‌లో జనసేన జగ్గంపేట ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో జనసేన నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జగ్గంపేట జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. టీడీపీ జగ్గంపేట కార్యాలయంలో మంగళవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా టీడీపీ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్ హాజరయ్యారు. పార్టీ అభిమానులు, కార్యకర్తలతో పాటు జనసేన కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని కేక్ కట్ చేశారు. సగరపేట గ్రామంలో పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. దీనికి జగ్గం పేట జనసేన పార్టీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు. జనసైనికులు, నాయకులతో కలిసి కేక్‌కట్ చేశారు.సగరపేట జనసేన నాయకులు, కార్యకర్తలు, జగ్గంపేట నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు,(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద జనసేన, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సత్యప్రభ కట్ చేశారు. అనంతరం 150మంది దివ్యాంగులు, నిస్సహాయులకు బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. పవన్ పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ, జనసేన సమన్వయ కర్త మేడిశెట్టి సూర్యకిరణ్(బాబి), అంబటి బుజ్జి, వెలుగుల నాని, గోపిశెట్టి శ్రీను స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొమ్ముల కన్నబాబు, అమరాది వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. రాచపల్లి గ్రామంలో పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా మాజీ సర్పంచ్ బుద్దరాజు గోపిరాజు కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గ్రంధి రాజు, గాదం భీమరాజు, ఉల్లి నాని పాల్గొన్నారు. నిరుపేదలకు బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాంబశివ, పెద్దిరెడ్డి కాపు చక్రధర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో ఎటువంటి బాధ్యతలు అప్పగించినా పని చేస్తానని ఆ పార్టీ మహిళా నాయకురాలు బార్లపూడి క్రాంతి అన్నారు. మంగళవారం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బాలింతలు, గర్భిణులు, రోగులకు ఆమె పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జనసేన మహిళా రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమిస్తారనే వార్తలపై ఆమె స్పందిస్తూ ఏ పదవి ఇచ్చినా న్యాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సూర్నీడి సురేష్, ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం, (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని జనసైనికులు రక్తదాన శిబిరం నిర్వహించారు.స్థానిక ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో కాకినాడ రెడ్ క్రాస్ ప్రతినిధులు, జనసైనికులు పలివెల వెంకటేష్, అచ్చే వీరబాబు, గంగిరెడ్ల మణికంఠ నేతృత్వంలో 60మంది యువకులు రక్తదానం చేశారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు, జనసేన నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గండేపల్లి, (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని జడ్.రాగంపేట శివారు జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వద్ద జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహిం చారు. పవన్ కల్యాణ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ప్రతీ మంగళవారం డొక్కా సీతమ్మపేరిట ఉచిత అన్న క్యాం టీన్ నిర్వహిస్తున్నామన్నారు. జనసైనికులు పాల్గొన్నారు.

రౌతులపూడి, (ఆంధ్రజ్యోతి): బంగారయ్యపేట, రౌతులపూడి, గుమ్మరేగుల, గిడజాం, ఎస్.పైడిపాల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. రౌతులపూడిలో ప్రభుత్వాసుపత్రిలో జనసేన పార్టీ ప్రత్తిపాడు సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్, ప్రోగ్రాంకమిటీ మెంబర్ కరణం సుబ్ర హ్మణ్యం కేక్ కట్ చేశారు. రోగులకు పండ్లు అందజేశారు. పి.చామవరంలో జనసేన నాయకురాలు బర్లపూడి క్రాంతి పాల్గొని కేక్‌కట్ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి షేక్ సలీమ్, ఉపా ధ్యక్షుడు కర్రి గంగాధర్, మదాసు శ్రీను, తంటపురెడ్డి జయగంట, బచ్చల నానాజీ, పక్కుర్తి సతీష్, మేకల కృష్ణ పాల్గొన్నారు.

శంఖవరం, (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు నాయుకులు, అభిమానుల మధ్య ఘనంగా జరిగాయి. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్(బాబీ) ఆధ్వర్యంలో కత్తిపూడి, శంఖవరం ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అన్ని గ్రామాల్లో జనసేన, కూటమి నేతల ఆధ్వర్యంలో కేక్‌లు కట్‌చేసి అభిమానులకు, గ్రామస్తులకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో ప్రోగాం కమిటీ సభ్యులు కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్, పోసిన శ్రీను, తలపంటి బుజ్జి, కండిపల్లి ప్రవీణ్, గౌతు బుజ్జి, గఫూర్, పిల్లి దుర్గ పాల్గొన్నారు.

తొండంగి, (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం బెండపూడిలో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన, దంత, కంటి శిబిరాలు నిర్వహించారు. మమత మల్టీస్పెషాలటీ ఆసుపత్రి, హైమా నేత్రాలయ, సత్యదేవా డెంటల్ క్లినిక్‌ల సహకారంతో రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు జరిపి మందులు అందించారు. 340మంది రోగులు సేవలు పొందారు. 34మంది యువకులు రక్తదానం చేశారు. జనసేన నేతలు బూసాల ప్రవీణ్, బూసాల మణిబాబు, జనసేన మండల అధ్యక్షుడు బెండపూడి నాయుడు, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

తునిరూరల్, (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. చాణక్య బిర్యానీ పాయింట్ అధినేత దండు శివ ఆధ్వర్యంలో తుని తహసీల్దార్ కార్యాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తుని నియోజకవర్గ జనసేన సమన్వయకర్త చోడిశెట్టి గణేష్, వంగలపూడి నాగేంద్ర, గాంధీ సత్రం డైరెక్టర్ కోడూరి సురేష్, దంతులూరి శ్రీనివాసురాజు, చోడిశెట్టి భాస్కర్, వాడపల్లి రాము పాల్గొన్నారు.



తొండంగి: రక్తదానం చేస్తున్న జనసేన, కార్యకర్తలు, ఏలేశ్వరంలో రక్తదానం చేస్తున్న జనసేన కార్యకర్తలు

టీడీపీలో భారీగా చేరికలు


మాజీమంత్రి యనమల రామకృష్ణుడితో పార్టీలో చేరిన వారు

తునిరూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): తుని నియోజకవర్గంలో చేరికల కార్యక్రమాలు కొనసాగుతోన్నాయి. వైసీపీకి రాజీనామా చేసి పెద్ద ఎత్తున టీడీపీలో చేరుతున్న వారితో టీడీపీలో జోష్ కనిపిస్తోంది. తాజాగా కొలిమిరు గ్రామానికి చెందిన వందలాది మంది వైసీపీ కార్యకర్తలు పార్టీకి రాజీనామా చేసి తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ కొత్త, పాత వైషమ్యాలు పక్కనపెట్టి కార్యకర్తలు సమన్వయంతో సమష్టిగా పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రాచపోతల గంగాధర్, పెంటపాటి గణేష్, పందుల గంగ, లక్కాకుల దొరబాబు, మఠం రమణ, ఉండా సాయి, గంగిరెడ్డి వీరబాబు, కూనిశెట్టి ప్రసాద్, కూనిశెట్టి రఘు పాల్గొన్నారు.

వైఎస్‌కు ఘన నివాళి

అన్నవరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి పురస్కరించుకుని మంగళవారం వైసీపీ ఇన్‌చార్జి ముద్రగడ గిరి ఆదేశాలతో పార్టీ శ్రేణులు వైఎస్‌కు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కొండపల్లి అప్పారావు, బొబ్బిలి వెంకన్నబాబు పాల్గొన్నారు.

కిర్లంపూడి, (ఆంధ్రజ్యోతి): వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా పాలెం గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి వైసీపీ నాయకులు నివాళులర్పించారు. వైసీపీ నాయకుడు అడబాల సుబ్బారాయుడు, తామరాడ సర్పంచ్ తోట అయ్యన్న, గంధం బాబి, పెద్దిరెడ్డి లక్ష్మణ, పంది వీరవెంకటసత్యనారాయణ, శరకణం నాగగణేశ్వరరావు, అడబాల వీరభద్రరావు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలు

తునిరూరల్, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): భారతవికాస్ పరిషత్ తుని బ్రాంచ్ ఆధ్వర్యంలో సరస్వతి శిశు మందిర్‌లో క్విజ్ పోటీలు జరిగాయి. 14పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ స్థానంలో శ్రీప్రకాష్ విద్యానికేతన్ విద్యార్థులు, ద్వితీయ స్థానంలో లయోలా ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.

సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గండేపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజాసంక్షేమం, అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఆయన మంగళవారం పి.నాయకంపల్లిలో నిర్వహించిన స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, ఏఎంసీ చైర్మన్ అడపా భరత్, వైస్ ఎంపీపీ కుంచే రాజా, తోట రవి, కొత్త కొండబాబు, యువ నాయకులు జాస్తి వసంత్, కందుల చిట్టిబాబు, తహసీల్దార్ శ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌చార్జి పాలకుర్తి ఆదినారాయణ, కుంచే రామకృష్ణ, కంటిపూడి సత్యనారాయణ, శీలామంతుల వీరబాబు, ఉండవిల్లి వీర్రాజు, బొల్లంరెడ్డి రామకృష్ణ, బొండా శ్రీనుబాబు, కార్యదర్శి శిరీష పాల్గొన్నారు.

ఏలేశ్వరం, (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇచ్చే రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ-స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తోందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అన్నారు. మంగళవారం పట్టణంలో రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు సత్యవతి అందజేశారు. కౌన్సిలర్లు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి పాల్గొన్నారు.

అన్నవరం, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు కేరాఫ్‌గా తెలుగుదేశం పార్టీ నిలుస్తోందని టీడీపీ నాయకులు బొమ్మిడి సత్తిబాబు పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలో స్థానిక నాయకులతో కలసి స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీచేశారు. కార్యక్రమంలో నాయకులు కడుపుకుట్ల కృష్ణ, దాసరి శంకర్, మడ్డు వీరబాబు, కొండపల్లి నేరిబాబు, పంచదార్ల సత్యనారాయణ తదితరులున్నారు. రేషన్ డీలర్లు నేతి వెంకటేశ్వరరావు, దాసరి చక్రావతి పాల్గొన్నారు.

గండేపల్లి, (ఆంధ్రజ్యోతి): యల్లమిల్లిలో మంగళవారం టీడీపీ గ్రామాధ్యక్షుడు సుంకవిల్లి వీరవెంకటసత్యనారాయణ(సీఎం) ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. స్మార్ట్ కార్డులతో ప్రతీ ఒక్కరికి రేషన్ సక్రమంగా అందుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదిరెడ్డి కృష్ణార్జున, నాగరాజు, మద్దిపూడి సత్యనారాయణ ఉన్నారు.

రౌతులపూడి,(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీలో అక్రమాలు అరికట్టేందుకే స్మార్టు కార్డులను కూటమి ప్రభుత్వం అందజేస్తుందని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అన్నారు. రౌతులపూడిలో రేషన్‌షాపు 29లో ఆమె స్మార్టుకార్డులను అందజేశారు. వైసీపీ ప్రభుత్వంలో రేషన్ పంపిణీలో దారుణంగా అక్రమాలు జరిగాయన్నారు. ప్రతి గ్రామంలోనూ కూటమి నాయకులు స్మార్టు కార్డులు అందజేసారు. కార్యక్రమంలో కూటమి నేతలుపాల్గొన్నారు

శంఖవరం, (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటికీ పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలుఅందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ అన్నారు. మంగళవారం శంఖవరంలో నూతన రేషను కార్డులను పంపిణీ చేసి వారికి రేషన్ సరుకులు అందించారు. కార్యక్రమంలో తహసీల్దారు తాతారావు, ఉపసర్పంచ్ చింతంనీడి కుమార్, బుర్రా వాసు, బుర్రా లచ్చబాబు, రౌతు శ్రీనివాస్, బందిలి వీరబ్బాయి, చవల నూకరాజు, బందిలి పాపారావు, కానేటి వెంకటరమణపాల్గొన్నారు.

తొండంగి, (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు బహుళ ప్రయోజనాలు సమకూరుతాయని టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ అన్నారు. తొండంగి నెంబర్ రేషన్ షాపులో ఆయన స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ టి.కాంతారావు, ఆర్ఐ రాజారావు, సర్పంచ్ సోమాల ప్రసాద్, పక్కుర్తి నూకరాజు. మల్లిపాము సత్యనారాయణ పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో పారదర్శకత కోసమే స్మార్ట్ కార్డులు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసమే కూటమి ప్రభుత్వం స్మార్ట్ కార్డులు పంపిణీ చేపట్టిందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం మండలంలోని రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్ పంపిణీలో అవకతవకలు, అక్రమాలకు తావు లేకుండా స్మార్ట్‌కార్డుల విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. అర్హులైన దివ్యాంగుల పింఛన్‌ను ప్రభుత్వం తొలగించలేదని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ ఎం.సూర్యప్రభ మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొమ్ముల కన్నబాబు, సింగిలిదేవ్ సత్తిరాజు తదితరులతో పాటు రేషన్ డీలర్ల సంఘ నాయకులు ఏపూరి తిరుపతయ్య, గంటా రాంబాబు, తటవర్తి సందీప్ తదితరులతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక భరోసా సీఎం రిలీఫ్ ఫండ్

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 22 మంది లబ్ధిదారులకు రూ.15,09,552లు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం పెద శంకర్లపూడిలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే సత్యప్రభ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పుడు మెరుగైన వైద్య సేవలందుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఈ నిధుల ద్వారా వైద్య చికిత్స పొందుతూ ఊరట చెందుతున్నారు. ఎవరు ఇబ్బందుల్లో ఉన్నా, తక్షణమే సహాయం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదలపక్షాన అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎన్డీయే కూటమి శ్రేణులు, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అడిషనల్ కోర్టు ఏర్పాటు చేయాలి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో అడిషనల్ కోర్టును ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సత్యప్రభకు స్థానిక బార్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు ఆధ్వర్యంలో బార్ సభ్యులు న్యాయవాదులు మంగళవారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మధుబాబు, పలివెల నాగేంద్రరాజు, భారతి తదితరులు ఉన్నారు.

డీజే సౌండ్‌కు అనుమతి లేదు

జగ్గంపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనంలో అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా నడుచుకోవాలని జగ్గంపేట ఎస్సై టి.రఘునాధరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గణపతి నిమజ్జన సమయంలో డీజేలకు అనుమతి లేదన్నారు. పోలీస్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

మల్లేపల్లిలో పొలం పిలుస్తోంది

గండేపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మల్లేపల్లిలో జగ్గంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు జి.శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. బుధవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఏఈవో పి.చంద్రమౌళి, వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు ఎస్.ప్రత్యూష, రాజ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

అప్లికేషన్ డెవలప్‌మెంట్‌పై 'ఆదిత్య'లో వర్క్‌షాప్

గండేపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ డేటా సైన్స్ విభాగం సీఎస్ఐ స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో రెండో సంవత్సరం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ డేటా సైన్స్ విద్యార్థుల కోసం ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌పై ఐదురోజుల వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఏపీఎస్ఎస్‌డీసీ ఎగ్జిక్యూటివ్ టెక్నికల్ ట్రైనర్ ఎస్.వరప్రసాద్ రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. విద్యార్థులు మొబైల్ అప్లికేషన్ల రూపకల్పన, అభివృద్ధి, పరీక్ష ప్రాక్టికల్ నైపుణ్యాలు పొందడమే ఈకార్యక్రమ లక్ష్యమన్నారు.

రేడియో స్టేషన్‌ను సందర్శించిన 'ఆదిత్య' విద్యార్థులు

గండేపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ విద్యార్థులు పారిశ్రామిక సందర్శన, శిక్షణ కోర్సు పర్యవేక్షణలో భాగంగా ఈసీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, బోధన సిబ్బంది విశాఖపట్నంలోని ఆలిండియా రేడియో స్టేషన్ సందర్శించారు. ఎఫ్ఎం ట్రాన్స్‌మీటర్, రిసీవర్, స్టూడియోలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిపార్టుమెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి.శ్రీదేవి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ రాజశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కెహెచ్‌కె రఘువంశీ పర్యవేక్షణలో 97మంది విద్యార్థులు సందర్శించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సింగరంపాలెం నూతన సబ్‌స్టేషన్ పనుల్లో భాగంగా గండేపల్లి, ఎన్టీరాజాపురం, కె.గోపాలపురం గ్రామాలకు బుధవారం ఉదయం 8నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ వీరభద్రరావు, గండేపల్లి ఏఈ కిరణ్‌కిషోర్ తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

రౌతులపూడి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రౌతులపూడికి చెందిన డొంకా చంటికి మంగళవారం ఎమ్మెల్యే సత్యప్రభరాజా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రూ.1.06లక్షలు పెదశంకర్లపూడి క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ యువ నేతలు ఇటంశెట్టి అశోక్, పైల వేణుగోపాల్, పైల దివాణం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ప్రశంసలు పొందుతున్న 'ఆపస్' సేవలు

రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓలేటి శాస్త్రి

తొండంగి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం చేస్తున్న సేవలు ఉపాధ్యాయుల ప్రశంసలు పొందుతున్నాయని ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓలేటి వీవీ శాస్త్రి అన్నారు. మంగళవారం పెరుమాళ్ళపురంలో జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆపస్ ప్రభంజనం సృష్టిస్తోందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అంచనాలకు మించి ఉపాధ్యాయులు సభ్యులుగా చేరడం జాతీయవాదానికి వారిచ్చే మద్దతన్నారు. జిల్లా అధ్యక్షుడు చలపతి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు కొయ్యా శ్రీను, సుభాష్, జిల్లా ఉపాధ్యక్షులు కొంజర్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

తునిరూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): దొండవాక గ్రామంలో వేరుకుళ్లు తెగులు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. మేరా రేషం మేరా అభిమానం అనే కార్యక్రమం సీఎస్‌బి సైంటిస్టు ఈ.భువనేశ్వరి, జిల్లా పట్టు పరిశ్రమల అధికారి టి.రాజేంద్రప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో లంక రమణ షెడ్‌లో నిర్వహించారు. సైంటిస్టు భువనేశ్వరి మాట్లాడుతూ మల్బరీలో వేరుకుళ్లు వ్యాధి వల్ల మల్బరీ మొక్క వడిలిపోయి చనిపోతుందని, దీనికి ప్రధాన కారణం భూమిలో తేమశాతం 40శాతం కంటే తక్కువ ఉండడం, ఉష్ణోగ్రత 35డిగ్రీలు కంటే ఎక్కువ ఉండడమేనన్నారు. దీని నివారణకు మిస్టర్ ప్రో పౌడర్ 50గ్రాములు పది లీటర్ల నీటికి కలిపి మొక్క మొదలు వేరు మొత్తం తడిచేటట్లు చేయాలన్నారు.